

కళాశాలల ఖాతాల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్

- విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశం

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 344 | విజయవాడ, బుధవారం 17 జులై 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 17 July 2024 | Rs



సిడ్నీలో సూపర్ కింగ్స్ అకాడమీ

- సెప్టెంబరు నుంచి కోచింగ్

8



ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు

కేబినెట్ నిర్ణయం • కౌలు రైతులకు సులువుగా రుణాలు!

క్రాప్ ఇన్స్యూరెన్స్ చట్టాలపై సమగ్ర అధ్యయనానికి కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత ప్రభుత్వం జారీ చేసిన వివాదాస్పద ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ -2022ను మంత్రి మండలి సమావేశం రద్దు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ప్రజల్లో అనేక భయాందోళనలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఎన్నికల ప్రచార సమయంలో తాము అధికారంలోకి వస్తే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తామని తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్ధసారధి మీడియాకు వివరించారు. ఉచిత ఇసుక విధానానికి మార్గదర్శకాలు రూపొందించేంత వరకు గతంలో ఉన్న విధానాలను రద్దు చేసి, మధ్యంతర వ్యవస్థను ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జిఓ ఎంఎస్ నెంబర్ 43కు కేబినెట్ ఆమోదముద్ర వేసినట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటి వరకు ఆయాసంస్థలతో ఉన్న ఒప్పందాలను నిలిపివేయడం, స్టాక్‌ను సంబంధిత అధికారులకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పర్యావరణ హితంగా సమగ్ర ఇసుక విధానం (కాంప్రహెన్సివ్ శాండ్ పాలసీ)-2024ను రూపొందించాలని మంత్రి మండలి నిర్ణయించినట్లు పార్ధసారధి తెలిపారు. 2024-25 సంవత్సరానికి ధాన్యం కొనుగోలు కోసం రూ.2వేలకోట్ల రుణాన్ని వాణిజ్య బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి తీసుకునేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు గతంలో ఇచ్చిన అనుమతిని కూడా కేబినెట్ ఆమోదించింది. అదే విధంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కోసం ఎపి మార్క్‌ఫెడ్‌కు ఎన్‌సిడిసి (నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నుంచి వర్కింగ్ కేపిటల్ సహాయం రూపేణా రూ.3,200కోట్లు కొత్తగా రుణాన్ని పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వ హామీ కోరుతూ వ్యవసాయ, సహకార శాఖ చేసిన ప్రతిపాదనను కూడా మంత్రిమండలి ఆమోదించింది.



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

క్రాప్ ఇన్స్యూరెన్స్ చట్టాలపై నెలరోజుల్లో నివేదిక

క్రాప్ ఇన్స్యూరెన్స్ చట్టాలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ఆర్థిక, పౌరసరఫరాలు, వ్యవసాయశాఖ మంత్రులు ముగ్గురితో కూడిన అధ్యయన కమిటీ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. నెల రోజుల్లో నివేదికను ఇవ్వాలని ఆ కమిటీకి మంత్రిమండలి సూచించింది. ప్రస్తుతం అమలులో ఉన్న ధాన్యం కొనుగోలు విధానంలోని లోపాలను సవరించి రైతులకు సులువైన విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని కేబినెట్ అభిప్రాయపడినట్లు మంత్రివర్గ నిర్ణయాలను మీడియాకు వివరించిన మంత్రి పార్ధసారధి తెలిపారు.

కౌలు రైతులకు రుణాల కోసం సూచనలు

కౌలు రైతులకు సులువుగా రుణాలు ఇచ్చేందుకు వీలుగా సిసిఆర్‌సి కార్డుల మంజూరు, నిబంధనల సడలింపు అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల కారణంగా కౌలు రైతులు రుణాలు తీసుకునేందుకు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని ఆయన తెలిపారు. కౌలురైతులకు సులువుగా రుణాలు మంజూరు చేసేందుకు ఎటువంటి ప్రణాళిక అమలు చేస్తే బాగుంటుందనే అంశంపై ఎవరైనా మంత్రులకు సలహాలు, సూచనలు చేస్తే ఆయా అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్రానికి గుల్బెంకియన్ అవార్డు

ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుల్బెంకియన్ అవార్డు వచ్చిందని, ఇది వ్యవసాయరంగంలో నోబెల్ ప్రైజ్‌తో సమానమని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్ధసారధి పేర్కొన్నారు, 2029 నాటికి 20లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ప్రకృతి సేద్యంలో రాష్ట్రం ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచి ఆదర్శప్రాయంగా నిలుస్తుందని సిఎం చంద్రబాబునాయుడు మంత్రివర్గ సభ్యులకు తెలిపారు.

మంత్రులకు సిఎం క్లాస్

- ఒకరి శాఖల్లో మరొకరు జోక్యం చేసుకోవద్దు
- ఎమ్మెల్యేలతో పంతాలకు పోవద్దు
- 'ఆ' ముగ్గురి పనితీరు భేష్
- మిగిలిన వారు మెరుగుపరుచుకోవాలి
- కేబినెట్‌లో మంత్రులతో చంద్రబాబు

లోపలి పేజీలో..

వలస కార్మికులపై

ఇంత నిర్లక్ష్యమా?

- 4 వారాల్లో వెరిఫికేషన్ పూర్తి చేయాలి
- రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : వలస కార్మికులకు రేషన్ కార్డుల జారీ విషయంలో రాష్ట్రాల నిర్లక్ష్య ధోరణిని సుప్రీంకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. వెరిఫికేషన్ పేరుతో జరుగుతున్న జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నాలుగు వారాల్లోగా వెరిఫికేషన్‌ను పూర్తి చేయాలని ఆదేశించింది. రేషన్ కార్డుల కోసం ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికుల వెరిఫికేషన్ ప్రక్రియను ఆలస్యం చేస్తుండటం చాలా దురదష్టకరమని వ్యాఖ్యానించింది. ఈ ప్రక్రియను నాలుగు వారాల్లోగా పూర్తి చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. జాతీయ ఆహార భద్రత చట్టం కింద కోటాతో సంబంధం లేకుండా వలస కార్మికులకు రాష్ట్రాలు రేషన్ అందించాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇ-శ్రమ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న దాదాపు 8 కోట్ల వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను గతంలోనే సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే, ఇప్పటివరకు తెలంగాణ, బీహార్ రాష్ట్రాలు మాత్రమే వారికి రేషన్ కార్డుల జారీ కోసం 100శాతం వెరిఫికేషన్ పూర్తి చేశాయి. పిటిషన్‌పై మంగళవారం విచారణ సందర్భంగా ఈ విషయాన్ని సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టు దష్టికి తీసుకొచ్చారు. కార్డులు జారీ అయినప్పటికీ కొన్ని రాష్ట్రాలు కార్మికులకు రేషన్ అందజేయడం లేదని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు రేషన్ రావట్లేదని ఆయా రాష్ట్రాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. 'ఇది చాలా దురదష్టకరమైన విషయం. నాలుగు నెలలైనా వెరిఫికేషన్ ప్రక్రియను ఎందుకు పూర్తిచేయలేదు. ఇప్పుడు మరో రెండు నెలలు గడువు కావాలని అడుగుతున్నారు. దీన్ని మేం ఆమోదించలేం. నాలుగు వారాల్లోగా అన్ని రాష్ట్రాలు వలస కార్మికుల వెరిఫికేషన్‌ను పూర్తి చేయాలి. ఒకవేళ రాష్ట్రాలు విఫలమైతే.. ఆయా కార్యదర్శులకు సమన్లు జారీ చేస్తాం' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను ఆగస్టు 27వ తేదీకి వాయిదా వేసింది.

భూ కుంభకోణాలపై

న్యాయ విచారణ

- అదానీ, కార్పొరేట్లకు ఇచ్చిన భూములను పేదలకు పంచాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్
- ఉచిత పంటల బీమా పథకం అమలు చేయండి
- విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయండి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జరిగిన వేల ఎకరాల భూకుంభకోణాలపై న్యాయ విచారణ జరిపించాలని, పరిశ్రమలు, కారిడార్ల పేరుతో అదానీ, ఇతర కార్పొరేట్లకు కట్టబెట్టిన భూములను వెనక్కు తీసుకుని పేదలకు పంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

వి.శ్రీనివాసరావు డిమాండు చేశారు. మంగళవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాంతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబునాయుడు భూములు, ఇసుక, మైనింగ్, అడవులపై ప్రకటించిన శ్వేతపత్రంలో రాష్ట్రంలో 1.75 లక్షల ఎకరాల భూమి అన్యాక్రాంతం అయినట్లు పేర్కొన్నారని, వీటిలో పేదల అసైన్డ్ భూమి కూడా ఉందని చెప్పారు. వేల ఎకరాలను పేదవాళ్ల నుండి చవకగా కొనుగోలుచేసి జిఓ నెంబరు 596 ప్రకారం 2023-24లో రిజిస్ట్రేషన్ కూడా చేశారని తెలిపారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేసి, భూములను వెనక్కు తీసుకుని పేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. దీనికి మూలమైన 596ను రద్దు చేయాలని కోరారు. వీటితోపాటు 2,500 ఎకరాలు గిరిజనుల భూమితో పాటు చిన్న రైతుల భూములను పంప్డ్ స్టోరేజీ హైడల్ ప్రాజెక్టు పేరుతో, డేటా సెంటర్ పేరుతో అదానీకి చట్ట విరుద్ధంగా కేటాయించారని, వీటి విలువ లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని చెప్పారు. అలాగే 2.25 లక్షల ఎకరాలు గత పది సంవత్సరాల్లో ఎస్‌ఈజడ్, పారిశ్రామిక కారిడార్ల పేరుతో వ్యాపారవేత్తలకు కట్టబెట్టారని, అక్కడ పరిశ్రమలు పెట్టకపోగా ఉద్యోగాలూ ఇవ్వలేదని తెలిపారు. ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వాన్‌పిక్ భూములు, సత్యసాయి జిల్లాలో నాలెడ్జ్ హబ్ భూములు, అలాగే విశాఖపట్నంలోనూ వేల ఎకరాలు పెద్దలకు కట్టబెట్టిన భూములు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వాటిని తీసుకుని పేదలకు పంచాలని డిమాండు చేశారు. 2.50 ఎకరాల మిగతా 7లో



లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తం

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


విదర్భకు ఆనుకుని దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా అల్పపీడనం కొనసాగుతోందని, ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17న అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు, 18, 19 తేదీల్లో రెండు, మూడుచోట్ల అతి భారీ వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. రానున్న నాలుగు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని అన్నారు.

బడ్జెట్‌లో ఎపికి ప్రాధాన్యత

- అమిత్ షాను కోరిన చంద్రబాబు
- నేడు నిర్మలమ్మతో భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద పీట వేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు కోరారు. మంగళవారం నాడిక్కడ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఆయన నివాసంలో సిఎం కలిశారు. దాదాపు గంటసేపు జరిగిన ఈ భేటీలో రాష్ట్ర విభజన సమస్యలు, బడ్జెట్ కేటాయింపుల అంశంపై చర్చించినట్లు సమాచారం. ఈ నెల 22న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 23న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటు తరువాత తొలిసారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ కేటాయింపులు చేయాలని, అలాగే ఏపిలో ఆయిల్ రిఫైనరీ, పెట్రోకెమికల్ హబ్‌ను ప్రకటించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు, రాజధాని నిర్మాణానికి నిధులు బడ్జెట్‌లో కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో బుధవారం భేటీ కానున్నారు.



అమిత్ షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చంద్రబాబు

ఆమెను కూడా బడ్జెట్ కేటాయింపులపైనే అభ్యర్థించనున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు ఈనెల 4, 5 తేదీల్లో ఢిల్లీలో పర్యటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సహా కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, పియూష్ గోయల్, నితిన్ గడ్కరీ, జెపి నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, హర్దీప్‌సింగ్ పూరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్‌లాల్ ఖట్టర్, రాందాస్ అథ్వాలే, నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రమణ్యం, 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియా తదితరులను కలిశారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీని రాష్ట్రానికి ఆర్థిక మద్దతు, పోలవరానికి కేంద్ర ప్రభుత్వ మద్దతు, రాష్ట్ర రాజధాని నిర్మాణానికి మద్దతు, పారిశ్రామిక అభివృధికి సహకారం, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, దుగ్గిరాజపట్నం పోర్టు ఏర్పాటు వంటి అంశాలపై కోరారు.

21న అఖిలపక్ష సమావేశం


- 23న కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు రోజు అంటే ఈ నెల 21న అఖిల పక్ష సమావేశం జరుగుతుంది. పార్లమెంటరీ మంత్రిత్వశాఖ మంగళవారం నాడు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల జేస్తూ పార్లమెంటు ఉభయ సభల్లోని వివిధ పక్షాల నేతలతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజ్జు ఆనవాయితీగా జరిపే ఈ సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఆ ప్రకటన తెలిపింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాలో రాహుల్ గాంధీ తొలిసారి ఈ సమావేశానికి హాజరుకానున్నారు. అన్ని రాజకీయ పార్టీల పక్షనేతలను ప్రభుత్వం ఆహ్వానించింది. జులై 21న అమరుల సంస్మరణ దినం కాబట్టి ఈ సమావేశానికి తాము హాజరుకాలేమని రాజ్యసభలో టిఎంసి పక్ష నేత డెరెక్ ఓబ్రియాన్ రిజ్జుకు రాసిన లేఖలో తెలిపారు. నీట్ పేపర్ లీక్, అగ్నిపథ్ పథకం రద్దు తదితర అంశాలపై చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుబట్టే అవకాశముంది. పద్దెనిమిదో. లోక్‌సభ ఏర్పడిన తరువాత జరిగిన మొదటి సమావేశంలో నీట్, మణిపూర్‌లో మారణకాండ, అధిక ధరలు వంటి అంశాలపై ఉభయ సభలు దద్దరిల్లాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని ఇచ్చిన సమాధానంలో మణిపూర్ కు



సంబంధించిన ఊసే లేదని ప్రతిపక్షాలు రాజ్యసభలో వాకౌట్ చేశాయి. ఈ వర్షాకాల సమావేశాల్లో నీట్, అగ్ని పథ్, ధరలు, నిరుద్యోగం వంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తేందుకు సిద్ధమవుతున్నాయి. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన మరుసటి రోజే కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. వరుసగా రెండో సారి ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన 2024-25 బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా మాజీ ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ రికార్డును అధిగమించనున్నారు. ఆయన ఆరుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టగా, నిర్మలా సీతారామన్‌కు ఇది ఏడవ బడ్జెట్ కావడం విశేషం.. 2019లో మోడీ 2.0 ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఆమె నియుక్తులయ్యారు.



చైతన్య, సూర్య తేజ (ఫైల్)

ఆస్ట్రేలియాలో ఇద్దరు ఆంధ్ర విద్యార్థులు మృతి

ప్రజాశక్తి- కందుకూరు

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఆస్ట్రేలియాలో మరణించారు. తన తోటి స్నేహితుడిని కాపాడే క్రమంలో ప్రమాదవశాత్తు జలపాతంలో పడి మృతిచెందారు. నెల్లూరు జిల్లా కందుకూరి పట్టణం వరపర్లవారిపాలెం గ్రామానికి చెందిన చైతన్య, బాపట్లకు చెందిన బొబ్బ సూర్యతేజలిద్దరూ ఆస్ట్రేలియాలో చదువుకుంటున్నారు. మంగళవారం ఓ జలపాతం చూసేందుకు చైతన్య, సూర్యతేజతో పాటు మరో స్నేహితుడు వెళ్లారు. కాలుజారి ఆ స్నేహితుడు జలపాతంలో పడిపోయాడు. అతడిని కాపాడే క్రమంలో చైతన్య, సూర్యతేజ కూడా అందులో పడిపోయారు. మిత్రుడు ఒడ్డుకు చేరుకోగా.. ఊపిరాడక చైతన్య, సూర్యతేజ మరణించారు. ఈ ఘటనతో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. స్వదేశానికి మృతదేహాలను త్వరగా తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మృతుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

జమ్మూకాశ్మీర్‌లో

భారీ ఎన్‌కౌంటర్

- అధికారితో సహా నలుగురు ఆర్మీ సిబ్బంది మృతి

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లోని దోడా జిల్లాలో సోమవారం రాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో మేజర్ సహా నలుగురు సైనికులు మరణిచారు. ఉగ్రవాదుల కదలికలపై సమాచారం అందుకున్న రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు, రాష్ట్ర పోలీసులకు చెందిన స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ దోడా పట్టణానికి 55 కిలోమీటర్ల దూరంలోని దెసా అటవీ ప్రాంతంలో సంయుక్తంగా గాలింపు చర్యలు చేపడుతుండగా రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఇరు పక్షాల మధ్య దాదాపు 20 నిమిషాల పాటు సాగిన భీకర పోరులో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఉగ్రవాదులు అక్కడి నుంచి తప్పించుకుపారిపోయేందుకు యత్నించగా దళాలు వారిని వెంటాడాయి. ఈ క్రమంలో దట్టమైన అటవీ ప్రాంతంలో మరోసారి కాల్పుల మోత మోగింది. ఉగ్రవాదులు వ్యూహాత్మకంగా జరిపిన ఈ ఎదురుదాడిలో కెప్టెన్ బ్రిజేష్ థాపా, నాయక్ డి రాజేష్, జవాన్లు బిజేంద్ర, అజయ్ చనిపోయారు. మరొకరి



పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆర్మీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇది పాకిస్తాన్ ప్రేరేపిత జైషే మహమ్మద్ షాడో గ్రూపు పనేనని ఆర్మీ తెలిపింది. ఈ నెల 9న కథువాలో సైనిక కాన్వాయ్‌పై దాడి చేసింది కూడా కాశ్మీర్ టైగర్లే. సంఘటనపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరా తీశారు. చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆయనకు టెలిఫోన్‌లో పరిస్థితిని వివరించారు. సోమవారం సాయంత్రం జరిగిన ఎన్‌కౌంటర్ గత మూడు వారాల వ్యవధిలో దోడా జిల్లా అడవుల్లో భద్రతా సిబ్బంది, ఉగ్రవాదుల మధ్య జరిగిన మూడో అతిపెద్ద ఎన్‌కౌంటర్‌గా అధికారులు చెబుతున్నారు.

సైనికుల మరణానికి ప్రతీకారం తీర్చుకుంటాం : జమ్మూకాశ్మీర్ ఎల్‌జి మనోజ్ సిన్హా

ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన సైనికుల మరణానికి ప్రతీకారం తీర్చుకుంటామని జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మంగళవారం ప్రకటించారు. సోమవారం రాత్రి దోడా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై ఎల్‌జి సోషల్ మీడియా ఎక్స్‌లో స్పందించారు. 'మేం మా సైనికుల మరణానికి ప్రతీకారం తీర్చుకుంటాం. ఉగ్రవాదుల, వారి భాగస్వాముల దుష్ట పన్నాగాలను అడ్డుకుంటాం. ఉగ్రవాదంపై పోరాటానికి ఐక్యంగా కదలిరావాలని ప్రజలకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను. మాకు ఖచ్చితమైన సమాచారాన్ని అందించండి. తద్వారా మేం ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రతరం చేయగలం. ఉగ్రవాదాన్ని నిర్మూలించగలం' అని మనోజ్ సిన్హా తన పోస్ట్‌లో తెలిపారు. అలాగే మరణించిన సిబ్బందికి నివాళలర్పించారు. 'దోడా జిల్లాలో మన ఆర్మీ, జమ్మూకాశ్మీర్ పోలీస్ సిబ్బందిపై జరిగిన పిరికిబంద దాడి గురించి తెలుసుకుని నేను చాలా బాధపడ్డాను. మన దేశాన్ని రక్షించడంలో అత్యున్నత త్యాగం చేసిన వీర జవాన్లకు నివాళులు. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని కూడా మనోజ్ సిన్హా తెలిపారు.

అవినీతిపై ఫిర్యాదుకు 9440440057

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎసిబి టోల్ ఫ్రీ నెంబరు 14400 పనిచేయడం లేదని, అవినీతిపై ఫిర్యాదులను 9440440057 నెంబరుకు ఫోన్ చేయొచ్చని ఎసిబి డిజి అతుల్‌సింగ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రకృతి వ్యవసాయం ఆదర్శం

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రపంచ దేశాలకు రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం ఆదర్శంగా నిలుస్తోందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. 45 దేశాల ప్రతినిధులు రాష్ట్రంలో అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించడం గర్వకారణమని తెలిపారు. 'గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటీ' అవార్డు ఎపిసిఎన్ఎఫ్‌కు వచ్చింది. ఈ అవార్డుతో రైతు సాధికార సంస్థ సిఇఒ విజయ్‌కుమార్, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్.. మంత్రి అచ్చెన్నాయుడును మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారిని మంత్రి అభినందించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

పాలిటెక్నిక్‌లో 37,036 సీట్లు భర్తీ

- ముగిసిన తుది దశ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిటెక్నిక్‌లో 37,036 సీట్లు భర్తీ అయ్యాయి. పాలిసెట్ తుది దశ కౌన్సెలింగ్ మంగళవారంతో ముగిసింది. రాష్ట్రంలో 262 పాలిటెక్నిక్ కళాశాలల్లో 81,420 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో 37,036 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 17,943 సీట్లు అందుబాటులో ఉండగా, 11,042 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ప్రైవేట్ కళాశాలల్లో 63,477 సీట్లకు 25,994 భర్తీ అయ్యాయని పాలిసెట్ కన్వీనర్ నవ్య వెల్లడించారు. తుది దశ కౌన్సెలింగ్‌లో 2,307 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారని వివరించారు. తుది దశలో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని తెలిపారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల జీతాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమగ్రశిక్షా ఆధ్వర్యంలో పనిచేస్తున్న కెజిబివి టీచర్లు, సిఆర్‌పిలు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర ఉద్యోగులకు మే, జూన్ వేతనాలు విడుదలయ్యాయి. వీరి వేతనాల కోసం రూ.122.23 కోట్లు విడుదల చేసినట్లు సమగ్రశిక్షా డైరెక్టర్ బిశ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది జీతాల కోసం రూ.105.20 కోట్లు, కెజిబివిల్లోని విద్యార్థినుల భోజన నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.17.02 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు.

టెట్ దరఖాస్తులో జాగ్రత్తలు తప్పనిసరి

- పాఠశాల విద్య డైరెక్టరు విజయరామరాజు


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తు నింపే సమయంలో అభ్యర్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరు విజయరామరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు నింపేందుకు అభ్యర్థి aptet.apcfss.in వెబ్‌సైట్‌లో మాత్రమే లాగిన్ కావాలని తెలిపారు. నోటిఫికేషన్, ఇతర సమాచారం బులిటెన్లను డౌన్‌లోడ్ చేసుకుని క్షుణంగా పరిశీలించి అర్థం చేసుకోవాలన్నారు. అభ్యర్థి పేరు, పుట్టిన తేదీ, విద్యార్హతలు, దరఖాస్తు చేసుకున్న పేపర్లు, మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్, వివరాలతో పేమెంట్ గేటు ద్వారా ఫీజు చెల్లించాలని వివరించారు. దరఖాస్తు నింపిన తర్వాత ప్రివ్యూ ద్వారా అన్ని వివరాలూ ఉన్నాయో లేదో పరిశీలించిన తరువాతే సబ్‌మిట్ చేయాలని సూచించారు. దరఖాస్తు నింపే సమయంలో సందేహాలుంటే హెల్ప్‌డెస్క్ నెంబర్లు 9505619127, 8121947387, 8125046997, 9398822554, 7995649286, 7995789286, 9963069286, 9398810958, 9398822618లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. లేదా grivances.tet@apschooledu.in మెయిల్‌కు సందేహాలు పంపొచ్చన్నారు.

మంత్రులకు సీఎం క్లాస్

- ఒకరి శాఖల్లో మరొకరు జోక్యం చేసుకోవద్దు
- ఎమ్మెల్యేలతో పంతాలకు పోవద్దు
- 'ఆ' ముగ్గురి పనితీరు బావుంది
- మిగిలిన వారు మెరుగుపరుచుకోవాలి

కేబినెట్‌లో మంత్రులతో చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'ఒకరి శాఖలో మరొకరు జోక్యం చేసుకోవద్దు. ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాడితే ప్రజలకు తప్పుడు సందేశాలు వెడతాయి. ఇది మంచిదికాదు.' అని రాష్ట్ర మంత్రులనుద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నట్లు సమాచారం. మంగళవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో అధికారులు బయటకు వెళ్లిన తరువాత మంత్రుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ వివిధ అంశాలపై సున్నితంగా క్లాసు తీసుకున్నట్లు తెలిసింది. ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణంపై రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎక్స్‌లో చేసిన పోస్టు పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'దసరా నుండి మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం' అంటూ ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై సిఎం 'ఇలా ఎలా చెబుతారు?' అని ప్రశ్నించినట్లు తెలిసింది. పాలసీ విషయాలపై తాను కానీ, లేక సంబంధిత మంత్రికానీ స్పందిస్తామే కాని ఇతరులు ఎవరికి తోచిన విధంగా వారు స్పందిస్తే ఎలా? అని ఆయన అన్నారు. ఇటువంటి పద్ధతులు మానుకోవాలని ఆయన చెప్పినట్లు తెలిసింది. ఒకరిద్దరు మంత్రులు ఆయా జిల్లాల్లోని ఎమ్మెల్యేలతో పంతాలకు పోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలా పంతాలకు పోకుండా వారిని సమన్వయం చేసుకుంటూ వెళ్లాలని సిఎం ఆదేశించారు. హెచ్‌ఓడిలతో సహా శాఖలకు సంబంధించిన అంశాలపై నెలనెలా సమీక్షలు చేపట్టాలని మంత్రులకు సూచించారు. ఇదే సందర్భంలో మొదటి నెల మంత్రుల పనితీరుపై ర్యాంకులు ఇవ్వనని చెబుతూనే వరుసగా నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, నారా లోకేష్‌ల పనితీరు బాగా ఉందని అన్నట్లు తెలిసింది. మిగిలిన వారు కూడా వారి వారి శాఖల్లో పట్టు సాధించేందుకు కృషి చేయాలని సిఎం పేర్కొన్నట్లు సమాచారం. ప్రభుత్వం పూర్తిగా లోటు బడ్జెట్‌లో ఉన్న విషయాన్ని గ్రహించి మసలుకోవాలంటూ ఆయన మంత్రులకు కీలక సూచనలు చేశారు. తమతమ శాఖలకు చెందిన పరిస్థితిని ప్రజలకు వివరించాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో మంత్రులు ఉండాలని సిఎం వారికి సూచించారు. అధికారాన్ని తలకెక్కించుకోవద్దని మంత్రులకు హితబోధ చేసినట్లు సమాచారం.

కళాశాలల ఖాతాల్లోనే

ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం

- విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని కళాశాలల ఖాతాల్లోనే జమ చేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉన్నత విద్యాశాఖపై సచివాలయంలో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు గతంలో తమ ప్రభుత్వంలో ఉన్న విధానాన్ని పునరుద్ధరించాలని చెప్పారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించాలన్నారు. ఇంజనీరింగ్, ఫార్మా తదితర కోర్సుల్లో విద్యనభ్యసిస్తున విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో రాష్ట్రప్రభుత్వం విద్యాదీవెన, వసతి దీవెనల కింద ఫీజులను జమ చేస్తున్న విషయం తెలిసిందే. వైసిపి ప్రభుత్వ హయాంలో మాత్రమే తల్లిదండ్రుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసింది. అంతకుముందు నేరుగా కళాశాలల యాజమాన్యాల ఖాతాల్లోనే ప్రభుత్వం జమ చేసింది. ఇప్పుడు మరలా పాత విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం కళాశాలలకు రూ.3480 కోట్ల బకాయిలు పెట్టడంతో విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిచిపోయాయని మంత్రి అన్నారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు కారణంగా విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైందని విమర్శించారు. 3,220 లెక్చరర్ పోస్టుల భర్తీకి సాధ్యమైనంత త్వరగా భర్తీ చేసేందుకు కసరత్తు చేపట్టాలని ఆదేశించారు. న్యాయపరమైన చిక్కులను తొలగించి రాజకీయ ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా భర్తీ ఉండాలని చెప్పారు. యూనివర్సిటీలకు సంబంధించి అకడమిక్, ఎగ్జామినేషన్ షెడ్యూల్, క్యాలెండర్ తయారుచేసి నిర్ణీత సమయంలో పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించాలని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల ప్రవేశాలపై దృష్టి సారించి అడ్మిషన్ల పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉన్నత విద్య సంస్థల వివరాలు, మౌలిక సదుపాయాలు, అడ్మిషన్లు, కోర్టు కేసుల వివరాలు తదితర అంశాలన్నింటినీ డ్యాష్‌బోర్డులో పొందుపరచాలని చెప్పారు. రాష్ట్రంలో శ్రీపొట్టిశ్రీరాములు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీల ఏర్పాటు చేసే అంశాలపై చర్చించారు. కళాశాలల్లో డ్రగ్స్‌ను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్ల నియామకం అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. డ్రగ్స్‌పై విద్యార్థులను చైతన్యం చేసేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహన్‌రావు, సాంకేతిక విద్య డైరెక్టర్ బి నవ్య తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ సెక్రటరీ జనరల్‌గా ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ సెక్రటరీ జనరల్‌గా ప్రసన్నకుమార్ సూర్యదేవర నియమితులయ్యారు. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు సమక్షంలో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రసన్నకుమార్ కేంద్ర ప్రభుత్వంలో వివిధ హోదాల్లో 30ఏళ్ల పాటు విశిష్ట సేవలందించారు. అందులో 15 ఏళ్లపాటు అత్యున్నత రాజ్యాంగ కార్యాలయాల్లో పనిచేసిన అనుభవం ఉంది. గతంలో ఐదేళ్లపాటు లోక్‌సభ స్పీకర్‌కు ఓఎస్‌డిగా పనిచేశారు. ప్రసన్నకుమార్‌ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు సెక్రటరీ జనరల్‌గా ఎంపిక చేయగా, మండలి ఛైర్మన్ కొయ్యె మోషేన్‌రాజు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఆమోదం తెలిపారు. ఆయన కర్నూలులోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలలో సైన్స్‌పట్టా పొందారు. అనంతరం న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంనుంచి పర్యావరణ శాస్త్రంలో ఎమ్మెస్సీ, ఎంఫిల్ డిగ్రీలు, ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో డిగ్రీ పట్టా పొందారు.

తిరుమల జెఇఓగా సిహెచ్ వెంకయ్య చౌదరి

తిరుమల తిరుపతి దేవస్థానం జెఇఓగా సి అండ్ ఐటి 2005 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి సిహెచ్ వెంకయ్య చౌదరిని ప్రభుత్వం నియమించింది. ఆయనను డిప్యుటేషన్‌పై పంపేందుకు ఢిల్లీలోని అపాయింట్‌మెంట్ కమిటీ ఆఫ్ కేబినెట్ ఆమోదించింది. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.



బాలిక బంధువులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రామారావుతదితరులు



చేబ్రోలు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న విద్యార్థులు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- మార్చురీ వద్ద దళిత, ప్రజా సంఘాల ఆందోళన
- దళిత బాలిక మృతదేహానికి పోస్టుమార్టం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

దళిత బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని, అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెం గ్రామస్తులు, దళిత, ప్రజా సంఘాల నాయకులు మంగళవారం గుంటూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీ ముందు ధర్నా నిర్వహించారు. న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని బైఠాయించారు. నిందితుడిని త్వరలో అరెస్టు చేస్తామని, బాలిక కుటుంబానికి న్యాయం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో, ఆందోళన విరమించారు. ధర్నాలో రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్త రెడ్డిపాలేనికి చెందిన దళిత బాలికను అత్యాచారం చేసి అనంతరం హత్య చేసిన నాగరాజును కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 7వ తరగతి చదువుతున్న బాలికపై ఇంత దుర్మార్గంగా వ్యవహరించడం దారుణమన్నారు. రాష్ట్రంలో దాడులు పెరిగిపోయాయని, ఎస్‌సి, ఎస్‌సి, బిసి మైనార్టీలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు కూచిపూడి సత్యం మాదిగ మాట్లాడుతూ దళిత బాలిక కుటుంబానికి న్యాయం చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయీబ్రాహ్మణ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దళిత బాలిక కుటుంబసభ్యులకు సిపిఎం పరామర్శ

దళిత బాలిక కుటుంబ సభ్యులను గుంటూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, పలువురు సిపిఎం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ దళిత బాలికను అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని, పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిగి నిజానిజాలు వెలికి తీయాలని డిమాండ్ చేశారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు పూనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బాలిక కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సిపిఎం జిల్లా నాయకులు ఈమని అప్పారావు, దండా లక్ష్మీనారాయణ, వై.కృష్ణకాంత్, కిరణ్ తదితరులు ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన ర్యాలీ

నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కొత్తరెడ్డిపాలెం నుంచి చేబ్రోలు రోడ్డు వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు ముఖ్యంగా చిన్నారులు, బాలికలు, విద్యార్థినులు అత్యాచారాలు, హత్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పోస్టుమార్టం నివేదిక ప్రకారం చర్యలు : డిఎస్‌పి

బాలిక మృతదేహానికి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం పోస్టుమార్టం జరిగింది. వైద్యుల నివేదిక ప్రకారం తదిపరి చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి రమేష్ తెలిపారు.



స్వర్ణాల చెరువు వద్ద యాత్రికులు

'రొట్టెల పండుగ' సందడి

- నేడు లాంఛనంగా ప్రారంభం
- భారీగా తరలివస్తున్న యాత్రికులు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

మతసామరస్యానికి ప్రతీక అయిన రొట్టెల పండుగ సందడి నెలకొంది. బుధవారం నుంచి 21 వరకు జరిగే పండుగకు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున యాత్రికులు నెల్లూరుకు చేరుకుంటున్నారు. మంగళవారం ఉదయం నుంచి స్వర్ణాల చెరువు యాత్రికులతో కిటకిటలాడింది. స్నానాలు చేసి, రొట్టెలు మార్చుకున్నారు. నేడు మొహర్రం కావడంతో రద్దీ మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలు, 52 సిసి కెమెరాలు, కంట్రోల్ రూమ్, 25 పార్కింగ్ ప్రదేశాలు,17 మొబైల్ పార్టీలతో పోలీసులు చర్యలు చేపట్టారు. సుమారు 2000 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. పోలీసులకు ఎస్‌పి కృష్ణకాంత్ దిశా, నిర్దేశం చేశారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారుల సమన్వయంతో రొట్టెల పండుగను విజయవంతం చేయాలని అధికారులను మంత్రి పి. నారాయణ విజ్ఞప్తి చేశారు.

వివేకా హత్య కేసులో సిబిఐ అధికారి పిటిషన్‌పై తుది విచారణ : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో గత సిబిఐ అధికారి రాంసింగ్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తుది విచారణ చేస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మంగళవారం ప్రకటించారు. విచారణ ఆగస్టు ఒకటికి వాయిదా వేశారు. వివేకా హత్య కేసులో తప్పుడు సాక్ష్యం ఇవ్వాలని సిబిఐ అప్పటి దర్యాప్తు అధికారి రాంసింగ్ బెదిరిస్తున్నారని పేర్కొంటూ పులివెందులకు చెందిన గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి కడప జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు రాంసింగ్‌పై 2022లో కేసు నమోదు చేశారు. దీనిని కొట్టేయాలంటూ రాంసింగ్ వేసిన పిటిషన్‌లో హైకోర్టు.. పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలను గతంలోనే నిలిపివేసింది. ఈ కేసు విచారణకు రాగా తుది విచారణ చేస్తామని ప్రకటించింది.

వైసిపి నేతలపై కఠిన చర్యలొద్దు

టిడిపి ఆఫీసుపై దాడి చేశారనే అభియోగాల కేసులో పలువురు వైసిపి నేతల విషయంలో కఠిన చర్యలు వద్దంటూ గతంలోని హైకోర్టు ఉత్తర్వులను మంగళవారం మరోసారి పొడిగించింది. విచారణను ఈ నెల 23కు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ విఆర్ కృపాసాగర్ ప్రకటించారు. టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆ పార్టీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, వైసిపి ప్రభుత్వంలో మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, విజయవాడ తూర్పు నియోజకవర్గ నేత దేవినేని అవినాష్ వేర్వేరుగా పిటిషన్లు వేశారు. విచారణను గురువారానికి వాయిదా వేయాలని పోలీసుల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, సీనియర్ లాయర్ పోసాని వెంకటేశ్వర్లు కోరారు. విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేయాలని పిటిషనర్ల తరపున సీనియర్ అడ్వకేట్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కోరారు. దీంతో విచారణను ఈ నెల 23కు వాయిదా వేసిన హైకోర్టు, అప్పటి వరకు పిటిషనర్లపై పోలీసులు ఏవిధమైన కఠిన చర్యలూ తీసుకోరాదని ఆదేశించింది.

ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1251వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యుఎటిడి, ఆర్అండ్‌డి, టెలికం, ఇటిఎల్, డిఎన్‌డబ్ల్యు విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా క్యుఎటిడి విభాగం నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కార్మికుల్లో నేటికీ ఆందోళన తగ్గలేదన్నారు. ప్లాంట్ పరిస్థితులను మెరుగుపరచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఇటీవల కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్లాంట్‌లో చేపట్టిన పర్యటన కార్మికుల్లో భరోసా నింపలేదన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షను గుర్తెరిగి విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించాలని కోరారు. పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపి, వర్కింగ్ క్యాపిటల్ కేటాయించాలని కోరారు. సొంత గనుల అవసరం ప్లాంట్‌కు ఎంతైనా ఉందని తెలిపారు.

ఏకలవ్య పాఠశాలల్లో స్థానికులనే నియమించాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో స్థానికులనే నియమించాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు కోరారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మంగళవారం ఆయన లేఖ రాశారు. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్‌ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్ఇఎస్‌టి) సంస్థ ద్వారా వివిధ రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులను నియమించారని తెలిపారు. కేంద్ర స్థాయిలో నియమించబడిన హిందీ ఉపాధ్యాయులు హిందీ భాషలో పాఠాలు చెప్పడం వల్ల పిల్లలకు భాష అర్థంకాక అయోమయానికి, ఆందోళనకు గురవుతున్నారని వివరించారు. దీని ద్వారా పిల్లల చదువు కుంటుపడుతుందని విద్యార్థులు, తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నాయకులు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. కేంద్రీకృత పద్ధతిలో కాకుండా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్ర పరిధిలో గల ఉపాధ్యాయులను నియమించాలని ప్రతిపాదిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాశారు.

స్పీకరును కలిసిన సిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ కలిశారు. శాసనసభ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా స్పీకరును సిఎస్ కలిశారు. ఈ నెల 22 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. ఈ సమావేశాల నిర్వహణకు సంబంధించిన అంశాలు ఇరువురి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం.

మంత్రులను కలిసిన పలువురు అధికారులు

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను పలువురు ఉన్నతాధికారులు సచివాలయంలో కలిశారు. మంత్రి డోలాను సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కె కన్నబాబు, గ్రామ, వార్డు, సచివాలయశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్, విభిన్న ప్రతిభావంతులశాఖ ముఖ్య కార్యదర్శి ఎ సూర్యకుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సిసిఎల్ఎ)గా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం జి జయలక్ష్మి.. మంత్రి అనగానిని కలిశారు. భూ చట్టాల అమలు తీరుపై ఆమెతో మంత్రి చర్చించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

బాలిక ఆత్మహత్య కేసులో తొమ్మిది మంది అరెస్టు

ప్రజాశక్తి - మేడికొండూరు (గుంటూరు జిల్లా)

ప్రేమిస్తున్నానంటూ యువకుడు చేస్తున్న వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న బాలిక కేసులో నిందితుడిని, అతనికి సహకరించిన ఎనిమిది మందిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపాలెం గ్రామానికి చెందిన కొరగంటి నీలాంబరం గత కొంత కాలంగా ప్రేమ పేరుతో హౌస్‌గణేష్‌పాడు గ్రామానికి చెందిన కంచర్ల అంజలి (16)ని వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఫిరంగిపురంలో తిరుణాళ్లకు శనివారం కుటుంబంతో వచ్చిన బాలికను నిందితుడు ప్రేమించమని, పెళ్లిచేసుకుందామని వేధించాడు. గమనించిన బాలిక తండ్రి నీలాంబరాన్ని నిలదీశారు. అనంతరం తన కుటుంబాన్ని తీసుకుని గ్రామానికి తిరిగి వెళ్లిపోయారు. దీన్ని మనస్సులో పెట్టుకున్న నీలాంబరం తన స్నేహితులతో కలిసి బాలిక ఇంటికి వెళ్లి గొడవ చేయడంతోపాటు బాలిక తండ్రిపై దాడి చేశాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. మతురాలు తండ్రి కంచర్ల జోజప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫింగపురం ఎస్ఐ వీరనారాయణ కేసు నమోదు చేశారు. నీలాంబరం సహా తొమ్మిది మంది యువకులను అరెస్టు చేశారు.

దళిత బాలికపై అత్యాచారం

- ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన
- నిందితుడుని అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా)

స్కూలుకు వెళుతున్న బాలికను బలవంతంగా ఆటోలో తీసుకెళ్లి అత్యాచారం చేసిన ఘటన గుంటూరు జిల్లాలో మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం చినకోండ్రపాడు గ్రామానికి చెందిన దళిత బాలిక (15) జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. రోజుమాదిరిగానే శుక్రవారం స్కూలుకు వెళ్లారు. అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గడికోట వెంకట కోటేశ్వరరావు బాలికను ఆటోలో వెంబడించాడు. బలవంతంగా బాలికను ఆటోలో ఎక్కించుకుని నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదించాడు. అనంతరం బాలిక ఇంటికి చేరుకుంది. పాఠశాలకు వరుసగా రెండు రోజులు సెలవులు కావడంతో ఇంటివద్దే ఉంది. సోమవారం స్కూలుకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉండడంతో బాలికను ఆమె తల్లిదండ్రులు నిలదీయడంతో జరిగిన విషయం గురించి చెప్పింది. బాధితురాలి తల్లిదండ్రులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఇన్‌ఛార్జ్ ఎస్ఐ రవీంద్ర తెలిపారు. అధికార పార్టీ నాయకులు విషయాన్ని రాజీ చేయడానికి ప్రయత్నించారని బాధిత బాలిక బంధువులు తెలిపారు. చినకోండ్రుపాడులో నిందితుడు కోటేశ్వరరావును అరెస్టు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కృష్ణపట్నం పోర్టు కార్మికులపై యాజమాన్యం దాడి

ప్రజాశక్తి - నెల్లూరు



చికిత్స పొందుతున్న కార్మికుడు వీరబాబు

కార్మికులపై అదాని కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం దాడి చేసింది. పని భారం తగ్గించాలని కోరిన లారీ డ్రైవర్ సూర్యనారాయణ, వీరబాబుపై దాడికి దిగింది. పోర్టులోని మారుతి నందన్ కంపెనీలో సోమవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. గాయపడిన కార్మికులను నెల్లూరులోని మెడికోవర్ ఆస్పత్రికి తోటి కార్మికులు తరలించారు. కార్మికులపై దాడి చేయడాన్ని కృష్ణపట్నం పోర్టు క్లియరింగ్ అండ్ ఫార్వాడింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఖండించారు. చికిత్స పొందుతున్న కార్మికులను సిఐటియు నాయకులు పరామర్శించారు.

శ్రీవారి ఆలయంలో వైభవంగా ఆణివారి ఆస్థానం

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో ఆణివారి ఆస్థాన మహోత్సవాన్ని టిటిడి అధికారులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఉదయం ఆనంద నిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామిలను అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై తిరుమల పురవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్, చిన్న జీయర్, ఇఒ, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతి నాడు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. అయితే సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివార ఆస్థానం అని పేరు వచ్చింది. ఆణివార ఆస్థానం పర్వదినంనాటి నుండి టిటిడి వారి ఆదాయ వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి.

శ్రీశైలంలో విద్యుదుత్పత్తి

- కుడి, ఎడమ గట్ల జల విద్యుత్ కేంద్రాల నుంచి ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్తు కేంద్రాల నుంచి విద్యుతు ఉత్పత్తిని సోమవారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని దిగువ నాగార్జునసాగర్‌కు తాగు, సాగు అవసరాల కోసం మూడు టిఎంసిల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్ ఉత్పత్తి కోసం 15,549 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం నుంచి 12,713 క్యూసెక్కుల నీటిని దిగువ సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి మొత్తం 38,262 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కృష్ణ ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం లేదు. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి జలాశయ నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 812.30 అడుగులుగా ఉంది. నీటి నిలువ సామర్థ్యం 215 టిఎంసిలకు గాను ప్రస్తుతం 35.6294 టిఎంసిలు ఉన్నాయి. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి తెలంగాణ పరిధిలోని మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 1352 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతమైన ఆల్మట్టి డ్యామ్‌లో నీరు పూర్తిస్థాయికి చేరిందని సమాచారం. ఆగస్టులో శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

రాజధానిలో భూముల ధరలకు రెక్కలు

- పనులు ప్రారంభం కాకముందే భారీగా పెరుగుదల
- గత ఏడాది కన్నా రెట్టింపయిన వైనం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతి గ్రామాల్లో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని గ్రామాల్లో కొన్ని అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. 70 నుంచి 80 శాతం పూర్తయిన భవనాలను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది. దీంతో, రాజధాని గ్రామాల్లో భూముల క్రయవిక్రయాలు ఊపందుకున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారుతుందని, అమరావతికి పూర్వ వైభవం వస్తుందని ముందే ఊహించిన కొంతమంది రియల్టర్లు ఆరు నెలల క్రితమే ఈ ప్రాంతంలో భూములు కొనుగోలుకు శ్రీకారం చుట్టారు. గత నెల జూన్ మొదటి వారం నుంచి క్రయవిక్రయాలు మరింత పెరిగాయి. మెట్ట ప్రాంతంలో గతేడాది భూమి ధర గజం రూ.20 వేలు నుంచి 25 వేలు వరకు ఉండగా, ఇప్పుడు రూ.35 నుంచి రూ.40 వేలకు పెరిగింది. జరీబు (మాగాణి) గ్రామాల్లో గతేడాది గజం రూ.30 వేల నుంచి రూ.35 వేలు ఉండగా, ఇప్పుడు ఏకంగా రూ.50 వేల నుంచి రూ.60 వేలకు చేరుకుంది. గత వారం రోజుల్లో గజం రూ.52 వేల నుంచి రూ.56 వేల మధ్య రిజిస్ట్రేషన్లు జరిగాయి. తుళ్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో గత నెలలో 280 రిజిస్ట్రేషన్లు జరగా, ఈ నెలలో గడిచిన పది రోజుల్లోనే 108 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఏప్రిల్‌లో 190, మేలో 221 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాజధాని గ్రామాల్లో 2015లో అప్పటి టిడిపి ప్రభుత్వం భూసమీకరణ ద్వారా రైతుల నుంచి 34,772 ఎకరాలను తీసుకుంది. భూములిచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని ప్రకటించింది. మూడేళ్లలో రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని సిఆర్‌డిఎ చట్టంలో పేర్కొంది.


రాజధాని గ్రామాల్లోని భూములు

2018లో ప్లాట్లు కేటాయించినా అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యేలోగా రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చింది. పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి.

ఆ తరువాత 2019 డిసెంబరు 17న అమరావతి రాజధాని స్థానంలో మూడు రాజధానులు ఏర్పాటు చేస్తున్నట్లు అప్పటి వైసిపి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో, అమరావతిలో సంక్షోభం ఏర్పడింది. భూముల క్రయవిక్రయాలు మందగించాయి. తాజాగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మళ్లీ అమరావతికి కొత్త కళ సంతరించుకుంటుందని భావించి పలువురు రియల్టర్లు, ధనికులు, వ్యాపారవేత్తలు రాజధానిలో భూముల కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి భూములిచ్చిన రైతులు తమ ప్లాట్లను విక్రయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మెట్ట ప్రాంతంలో ఎకరా భూమి ఇచ్చిన రైతుకు వెయ్యి గజాలు డొమెస్టిక్ ల్యాండ్, 200 గజాలు కమర్షియల్ ల్యాండ్, ఎకరా జరీబు భూమి ఇచ్చిన రైతులకు 1200 గజాలు డొమెస్టిక్ ల్యాండ్, 250 గజాలు కమర్షియల్ ల్యాండ్ కేటాయిస్తూ ప్రభుత్వం సంబంధిత పత్రాలను రిజిస్ట్రేషన్ చేసింది. మొత్తం 54 వేల ప్లాట్లు రైతులకు రిటర్నబుల్‌గా ఇచ్చింది. ప్రస్తుతం రైతులు వీటిని విక్రయిస్తున్నారు. రాజధాని సమీపంలోని పెదకూరపాడు, సత్తెనపల్లి, క్రోసూరు, అచ్చంపేట, తాడికొండ, మంగళగిరి, పెదకాకాని తదితర మండలాల్లో కూడా గత రెండు నెలల కాలంలో పొలాలకు, స్థలాలకు 50 నుంచి వంద శాతం వరకు ధరలు పెరిగాయి. మొత్తంగా గుంటూరు జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకొంది.



బాధితున్ని పరామర్శిస్తున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు నల్లప్ప, ఆనందబాబు

కదిరి ప్రభాకర్‌కు న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- అధికారుల్లో చలనం లేకపోవడం దారుణం : కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప జిల్లాలోని ఒంటిమిట్ట మండలం, పెన్నపేరూరు గ్రామంలో దళితుడు కదిరి ప్రభాకర్ ఒంటి పై సలసల కాగిన నూనె పోసిన ఘటనపై రాష్ట్ర వ్యాప్త నిరసనలు జరుగుతున్నా, అధికారుల్లో మాత్రం చలనం లేదని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఒ నల్లప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి ఆనందబాబు విమర్శించారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రతినిధి బృందం మంగళవారం కడప జిల్లా రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కదిరి ప్రభాకర్‌ను పరామర్శించింది. బాధితుని కుటుంబాన్ని కలిసి వివరాలు అడిగి తెలుసుకుంది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో పాశవికమైన ఘటన జరిగి ఐదు రోజులైనా బాధితులకు ఎఫ్ఐఆర్ ఇవ్వలేదని, నిందితుని అరెస్టు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐను ఎఫ్ఐఆర్ కాపీ అడిగితే బాధితుడ్ని వచ్చి తీసుకెళ్లమనడం దుర్మార్గమన్నారు. ప్రభాకర్‌పై నూనె పోసిన వెంకటసుబ్బారెడ్డిని మాత్రమే అరెస్ట్ చేస్తే సరిపోదని, ప్రోత్సహించిన కుటుంబ సభ్యులపైనా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఐఆర్‌లో వివక్షత, హత్యాయత్నం, అత్యాచారం కేసులు నమోదు చేసి బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఉన్న వీధి అరుగుపై దళితులను కూర్చోబెట్టాలా ప్రభుత్వమే చొరవచూపాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళితులందరితో కలిసి వివక్షత నిర్మూలించేలా ప్రతిఘటన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. కెవిపిఎస్ ప్రతినిధి బృందంలో ఆ సంఘం కడప జిల్లా నాయకులు రాజేంద్ర, నంద్యాల జిల్లా నాయకులు కె రాజ్‌కుమార్ ఉన్నారు.

నిరసనలు వాయిదా : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను నిలిపి వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో తమ నిరసనలను వాయిదా వేస్తున్నట్లు ఎపిటిఎఫ్ వెల్లడించింది. ఈ నెల 16, 17 తేదీల్లో అన్ని జిల్లాల్లో నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమాలను తాత్కాలి కంగా వాయిదా వేస్తున్నట్లు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గెజిట్ నోటిఫికేషన్ జారీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారణకు ఆదేశించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా సిపిఎస్‌పై సమీక్షించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 2004కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియామకమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు.

టిడిపి కార్యాలయంలో రోజుకొక మంత్రి, నేత

- నేటి నుంచి అందుబాటులోకి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కార్యాలయంలో ప్రతిరోజూ ఒక మంత్రి, ఒక పార్టీ సీనియర్ నేత అందుబాటులో ఉండనున్నారు. పార్టీ నాయకులు, శ్రేణుల కోసం అందుబాటులోకి ఉండాలని ఇటీవల టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే చంద్రబాబు ప్రతి శనివారం ప్రజావేదిక పేరుతో పార్టీ కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. మిగిలిన రోజుల్లోనూ ఈ వినతులను స్వీకరించాలని చంద్రబాబు ఆదేశించారు. ప్రతి శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ అందుబాటులో ఉండనున్నారు. బుధవారం నుంచి ఈ నెల 31 వరకు పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉండే మంత్రి, పార్టీ నేతల పేర్లను టిడిపి కార్యాలయం మంగళవారం విడుదల చేసింది.

మెల్‌బోర్న్‌లో టిడిపి విజయోత్సవాలు

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో టిడిపి గెలుపు సంబరాలు మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ నటులు శివాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఆర్ఐ టిడిపి తరపున ప్రకటించిన రూ.లక్ష ఉద్యోగాల హామీని అమలుపరచాలని కోరారు. సోషల్ మీడియాలో వైసిపి చేసే దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. మెల్‌బోర్న్ టిడిపి అధ్యక్షులు లగడపాటి సుబ్బారావు ఆధ్వర్యాన ఈ వేడుకలు జరిగాయి.

తేదీ	మంత్రి	పార్టీ నేత
జులై 17	ఎస్ సవిత	బొల్లినేని రామారావు (జాతీయ ఉపాధ్యక్షులు)
జులై 18	ఎన్ఎండి ఫరూఖ్	–
జులై 19	–	పల్లా శ్రీనివాస్ (రాష్ట్ర అధ్యక్షులు)
జులై 22	గుమ్మడి సంధ్యారాణి	కావలి ప్రతిభా భారతి (జాతీయ ఉపాధ్యక్షులు)
జులై 23	కొల్లు రవీంద్ర	కొట్ల సూర్యప్రకాష్ రెడ్డి (జాతీయ ఉపాధ్యక్షులు)
జులై 24	అనగాని సత్యప్రసాద్	బీద రవిచంద్ర (జాతీయ ప్రధాన కార్యదర్శి)
జులై 25	వాసంశెట్టి సుభాష్	కెఎస్ జవహర్ (జాతీయ ప్రధాన కార్యదర్శి)
జులై 26	–	పల్లా శ్రీనివాస్ (రాష్ట్ర అధ్యక్షులు)
జులై 29	కొండపల్లి శ్రీనివాస్	పనబాక లక్ష్మి (జాతీయ ఉపాధ్యక్షులు)
జులై 30	ఎం.రాంప్రసాద్ రెడ్డి	కంభంపాటి రామ్మోహన్‌రావు (జాతీయ ప్రధాన కార్యదర్శి)
జులై 31	బిసి జనార్ధన్ రెడ్డి	తోటా సీతారామలక్ష్మి (పొలిట్ బ్యూరో సభ్యులు)

25, 26 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు

- యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

మేజర్ పోర్టుల్లో షరతులు లేని వేతన ఒప్పందం చేయాలని, మూడు సంవత్సరాల బోనస్ బకాయిలు చెల్లించాలని, పోర్టుల ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25, 26 తేదీల్లో విశాఖపట్నం పోర్టు ప్రాంతంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.రామలింగేశ్వరరావు తెలిపారు. విశాఖలోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2022 జనవరి నుంచి అమలు చేయాల్సిన వేతన పెంపుదలను ప్రభుత్వం నేటి వరకూ అమలు చేయకపోవడం సరికాదన్నారు. బోనస్ బకాయిలు చెల్లించాలని, కొత్త బోనస్ ఇవ్వాలని కోరారు. నేషనల్ ఎసెట్స్ మానిటైజేషన్ పైపులైన్ పథకం కింద మేజర్ పోర్టుల ఆస్తుల అమ్మకానికి పెట్టారని, దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పోర్టుల్లో టెక్నికల్, ఆపరేషనల్, మినిస్టీరియల్, అన్ని ఎంట్రీ లెవెల్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగులు, అధికారులను నియమించే 2023 నవంబర్ 27 నాటి మంత్రిత్వ శాఖ ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పిపిపి పద్ధతిలో పోర్టు హాస్పిటళ్లను నడిపే విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. పోర్టుల్లో పని చేస్తున్న నాన్ పర్మినెంట్, ఫూల్ కళాసీలు, సిహెచ్‌డి క్యాజువల్, సిహెచ్‌డి క్యాంటీన్, సిహెచ్‌డి ఆఫ్ బేసిక్, కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అంతవరకు చట్ట ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్టీవ్ డోర్ కార్మికులకు, షోర్ లేబర్‌కు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు, సౌకర్యాలలో కాంట్రాక్టర్లు విఫలమైతే ప్రిన్సిపల్ ఎంప్లాయిర్ అయిన పోర్టు చైర్మన్‌లే ప్రధాన బాధ్యత వహించాలని కోరారు. ఐపిసిలో కొత్తగా ప్రవేశపెట్టిన మూడు క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు జె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కృత్రిమ మేధపై ఐసిఎఐ దృష్టి

- ఎఐ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం
- ఐసిఎఐ సిఎ జిపిటి ఆవిష్కరణ
- ఆ సంస్థ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ వెల్లడి

హైదరాబాద్ : కృత్రిమ మేధా (ఎఐ)ను అందిపుచ్చుకోవడంపై కీలక దృష్టి సారించినట్లు ది ఇన్స్‌ట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) వెల్లడించింది. మంగళవారం హైదరాబాద్‌లో ఐసిఎఐ రెండు రోజుల ఎఐ ఇన్నోవేషన్ సమ్మిట్-ఎఐఎస్ 2024 ప్రారంభమైంది. ఇందులో ప్రపంచ ఎఐ నిపుణులచే ప్యానెల్ చర్చలను ఏర్పాటు చేసింది. జులై 16, 17 తేదీల్లో 'ట్రాన్స్‌ఫార్మింగ్ అకౌంటింగ్, ఆడిట్, టాక్స్, గవర్నెన్స్' అనే నినాధంతో దీన్ని నిర్వహిస్తుంది. ఆయా రంగాలలో ఎఐ ఆవిష్కరణలు, అనివార్యం గురించి నిపుణులు చర్చించారు. ఐసిఎఐ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ అగర్వాల్ సమ్మిట్‌ను ప్రారంభించి మాట్లాడుతూ.. సిఎ విద్యార్థుల కోసం జులై ఒక్కటో తేదిన ఐసిఎఐ సిఎ చాట్ జిపిటిని అందుబాటులోకి తెచ్చామన్నారు. దీన్ని తమ 9.85 లక్షల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నా మన్నారు. తమ సభ్యుల కోసం ప్రత్యేకంగా సర్టిఫికెట్ కోర్సు ఆన్ ఎఐని కూడా ప్రవేశపెట్టామ న్నారు. ఇది ఎఐపై ప్రాథమిక అవగాహనను పెంచడానికి దోహదం చేస్తుందన్నారు. సాంకేతిక నైపుణ్యాలను పెంచడం ఈ కోర్సు ప్రధాన లక్ష్యమన్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖతో కలిసి అకౌంటెన్సీ ఫిర్యాదుల పరిష్కారానికి ఆడిట్ టూల్‌ను అందుబాటులోకి తేనున్నామన్నారు. ఇది సమస్యల పరిష్కారానికి, మోసాలను గుర్తించడానికి మద్దతు చేస్తుందన్నారు. ఇది చార్టర్డ్ ఎకౌంట్స్ సభ్యుల బాధ్యతను మరింత పెంచనుందన్నారు. ఐసిఎఐ వైస్ ప్రెసిడెంట్ చరన్‌జోత్ సింగ్ నందా మాట్లాడుతూ.. టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌లో ఐసిఎఐ ముందంజలో ఉందన్నారు. ముఖ్యంగా ఎఐని స్వీకరించడం, అమలు చేయడంపై ప్రధాన దృష్టి సారించామన్నారు. ప్రస్తుతం దేశంలో 60 శాతం కంపెనీలు ఎఐని అందిపుచ్చుకుంటున్నా యన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించు కోవడంలో తాము నిబద్ధతో ఉన్నామన్నారు. ఈ సమావేశంలో ఎఐ ఇన్ ఐసిఎఐ ఛైర్మన్ దయానివాస్ శర్మ, వైస్ ఛైర్మన్ ఉమేష్ శర్మ సహా ఐసిఎఐ సెంట్రల్, రీజినల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.





స్వల్పంగా పెరిగిన రూపాయి విలువ

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ ఆల్‌టైం కనిష్టం నుంచి స్వల్పంగా పుంజుకుంది. మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ మూడు పైసలు పెరిగి 83.58 వద్ద నమోదయ్యింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు స్వల్పంగా తగ్గడం రూపాయికి మద్దతునిచ్చింది. కాగా ఇంతక్రితం రోజు డాలర్‌తో రూపాయి మారకం విలువ 11 పైసలు పతనమై ఆల్‌టైమ్ కనిష్ట స్థాయి 83.61 వద్ద ముగిసింది.

బైజూస్‌పై దివాలా ప్రక్రియ

- ఎన్‌సిఎల్‌టిలో బిసిసిఐ పిటిషన్

బెంగళూరు : కరోనా కాలంలో ఒక వెలుగు వెలిగిన ఎడ్‌టెక్ వేదిక బైజూస్‌పై దివాలా ప్రక్రియ మొదలయ్యింది. స్పాన్సర్‌షిప్ బకాయిల చెల్లింపుల్లో బైజూస్ విఫలం అయ్యిందని బెంగళూరులోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)లో బిసిసిఐ పిటిషన్ దాఖలు చేసింది. కాగా.. దీని విచారణకు బెంచ్ అనుమతించింది. భారత క్రికెట్ టీమ్‌కు స్పాన్సర్‌షిప్‌నకు సంబంధించి బైజూస్ రూ.160 కోట్లు చెల్లించలేదని బిసిసిఐ ప్రధాన ఆరోపణ. బైజూస్ ఒకప్పుడు బిసిసిఐ స్పాన్సర్‌గా వ్యవహరించింది. 2023 నవంబర్ వరకు జెర్సీ స్పాన్సర్‌గా బైజూస్ వ్యవహరించాల్సి ఉన్నప్పటికీ మధ్యలోనే వైదొలిగింది. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ ముగిసినా బకాయిలు చెల్లించకపోవడంపై బిసిసిఐ ఎన్‌సిఎల్‌టిని ఆశ్రయించింది.

పేటియంకు సెబీ నోటీసులు

ముంబయి : ఫిన్‌టెక్ సంస్థ పేటియంకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) నోటీసులు జారీ చేసింది. 2021-22లో పేటియం పేమెంట్స్ బ్యాంక్ (పిపిబి)తో నిబంధనలకు విరుద్ధంగా రెండు లావాదేవీలు నిర్వహించినట్లు తెలిపింది. కంపెనీ ఆడిట్ కమిటీ, వాటాదారుల నుంచి అనుమతి లేకుండానే లావాదేవీలు జరిపినట్లు పేర్కొంది. ఈ ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సెబీ స్పష్టం చేసింది. దీనిపై వీలైనంత త్వరగా స్పందించాలని పేటియంను ఆదేశించింది. దిద్దుబాటు కోసం ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలుపాలని పేర్కొంది. ఈ విషయమై తమకు సెబీ నుంచి లేఖ అందిందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు పేటియం సమాచారం ఇచ్చింది. సెబీ పేర్కొన్న రెండు లావాదేవీల మొత్తం రూ.324 కోట్లు, రూ.36 కోట్లు ఉంటుందని అంచనా. కాగా.. తాము నిబంధనలను ఉల్లంఘించ లేదని పేటియం పేర్కొంది. అలాగే సెబీ నోటీసుల వల్ల తమ కార్యకలాపాలు, ఆర్థిక వ్యవహారాలపై ఎలాంటి ప్రభావం ఉండదని తెలిపింది. మంగళవారం బిఎస్ఇలో పేటియం షేర్ 2.46 శాతం తగ్గి రూ.458.10 వద్ద ముగిసింది.



PTC INDUSTRIES
ASPIRE • INNOVATE • ACHIEVE

క్యూఐపితో రూ.700 కోట్ల నిధులు

- పిటిసి ఇండస్ట్రీస్ వెల్లడి

హైదరాబాద్ : ఎరోస్పేస్, రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ కంపెనీ పిటిసి ఇండస్ట్రీస్ తాజాగా రూ.700 కోట్ల నిధులు సమీకరించాలని నిర్ణయించింది. ఇందుకోసం తమ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని పిటిసి ఇండస్ట్రీస్ వెల్లడించింది. క్వాలిఫైడ్ ఇన్స్‌ట్యూషన్స్ ప్లేస్‌మెంట్ (క్యూఐపి) ద్వారా ఈ ఫండ్స్‌ను పొందాలని నిర్ణయించినట్లు ఆ సంస్థ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. దీనికి కంపెనీ సభ్యుల ఆమోదం, అవసరమైన ఇతర నియంత్రణ, చట్టబద్ధమైన సంస్థల ఆమోదాలు లభించాల్సి ఉంటుందని పేర్కొంది.

పంట బీమా సుకృతి సులభతరం

- క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ వెల్లడి

kshema


హైదరాబాద్ : తమ క్షేమ ప్లాట్‌ఫారమ్‌ను నవీకరించినట్లు క్షేమా జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ తెలిపింది. తద్వారా ఈ ఖరీఫ్ సీజన్ కోసం పంట బీమా ఉత్పత్తి అయిన 'సుకృతి'ని కొనుగోలు చేసే ప్రక్రియను మరింత సులభతరం చేస్తుందని పేర్కొంది. ఖరీఫ్ పంటను ప్రమాదాల నుండి రక్షించుకోవాలని చూస్తున్న కోట్లాది మంది రైతులకు సేవలను మెరుగుపరుస్తాయని తెలిపింది. ఈ ఖరీఫ్‌లో పంట బీమా ప్రీమియం ఎకరానికి రెండు ప్రమాదాల వరకు సరసమైన ప్రారంభ ధర రూ.499గా ఉంటుందని పేర్కొంది.

విద్యుత్ కమిషన్ చైర్మన్‌ను మార్చండి

- తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఆదేశం

ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో/హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలు, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంపై ప్రభుత్వం నియమించిన విచారణ కమిషన్ చైర్మన్‌ను మార్చాలని సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో, విచారణ బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్లు కమిషన్ చైర్మన్ జస్టిస్ నర్సింహారెడ్డి తన న్యాయవాది ద్వారా కోర్టుకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో సోమవారంలోపు నూతన చైర్మన్‌ను నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ పంపిన సమన్లపై మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం కెసిఆర్ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో కెసిఆర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సిజె జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. కమిషన్ చైర్మన్ జస్టిస్ నర్సింహారెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని కెసిఆర్ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. కమిషన్ ఇచ్చిన నోటీసులకు కెసిఆర్ సమాధానం ఇవ్వకముందే జస్టిస్ నర్సింహారెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారని, ఇది సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఈ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించి. కమిషన్ చైర్మన్‌ను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అందుకు ప్రభుత్వం అంగీకరించింది. సోమవారంలోగా నూతన చైర్మన్‌ను నియమిస్తామని కోర్టుకు తెలిపింది. దీంతో, ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం కొత్త జడ్జి నేతృత్వంలో కమిషన్ విచారణ కొనసాగించవచ్చని, పిటిషన్‌పై విచారణ ముగిసిందని సిజె ధర్మాసనం ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా వాదించారు.


శిబిరంలో రక్తదానం చేస్తున్న సిఐటియు నేతలు, కార్యకర్తలు

సామాజిక సేవలోనూ సిఐటియు

- రాష్ట్ర ఉపాధ్యక్షులు పి అజయ్ కుమార్
- సిఐటియు నేతల జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - విజయవాడ

కార్మికుల సమస్యలు, హక్కులపై పోరాటంలోనే కాదు, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ సిఐటియు ముందువరుసలో ఉంటుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్ కుమార్ తెలిపారు. వివిధ కార్మిక సంఘాల సీనియర్ నాయకులు టి.సుబ్బారెడ్డి (ముఠా), ఎం.డేవిడ్ (మున్సిపల్), ఎస్.ఎం.సుభానీ (రైల్వే) జ్ఞాపకార్థం సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన మంగళవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పి.అజయ్ కుమార్ ప్రారంభించారు. సిఐటియు నాయకులు, అనుబంధ కార్మిక సంఘాలకు చెందిన 39 మంది నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. అనంతరం వారందరికీ ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తున్న సిఐటియు సామాజిక, సేవా కార్యక్రమాల్లోనూ ముందు పీఠిన నిలుస్తోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సరళీకరణ విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వాలు రక్తం సేకరించడం, రక్తదానాన్ని ప్రోత్సహించడం అనే బాధ్యతలను గాలికి వదిలేశాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, కార్మికుల సహకారంతో తాము ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంజిత మాట్లాడుతూ సామాజిక సేవా దక్పథంతో సిఐటియు నేతలు రక్తదాన శిబిరం నిర్వహించటం హర్షణీయమన్నారు.

సంపాదకీయం


భద్రత లేని బతుకులు

నయా ఉదారవాద విధానాలు కార్మిక హక్కులపైనే కాదు, వారి భద్రతపైనా తీవ్ర దాడి చేస్తున్నాయి. నలుగురి ప్రాణాలను బలిగొని, ఇంకా అనేక మంది తీవ్ర గాయాల పాల్జేసిన అల్ట్రా టెక్ ప్రమాదమే ఇందుకు తాజా ఉదాహరణ. పార్లమెంటులో ఎలాంటి చర్చ లేకుండా మోడీ ప్రభుత్వం నిరుడు తీసుకొచ్చిన మూడు లేబర్ కోడ్‌లు కార్మికులకు ఉన్న అన్ని రక్షణలను తొలగించేశాయి. చివరికి వారి భద్రతను కూడా ప్రశ్నార్థకంగా మార్చేశాయి. ప్రైవేట్ రంగ పరిశ్రమలు అధిక లాభాల కోసం తక్కువ సిబ్బందితో ఎక్కువ గంటలు పనిచేయించడం, భద్రతా నిబంధనలను గాలికొదిలేసినా పట్టించుకునే నాథుడే లేకపోవడం వల్లే ఈ ప్రమాదాలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. ఫైనాన్స్ పెట్టుబడికి, బడా పెట్టుబడిదారులకు దాస్యం చేయడంపై ఉన్న శ్రద్ధ, కార్మికుల భద్రతపై పాలకులకు లేదని ఈ పారిశ్రామిక ప్రమాదాల పరంపర తెలియజేస్తోంది. ఎలాంటి రక్షణ చర్యలు, తనిఖీలు లేకపోవడంతో ఫార్మా, సిమెంట్, రసాయన పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అల్ట్రాటెక్ బాలాజీ సిమెంట్ ఫ్యాక్టరీలోని కిలన్ విభాగంలో లైమ్‌స్టోన్, ఐరన్ ఓర్, రెడ్ సాయిడ్‌ల మిశ్రమం లీకవుతోందని, రక్షణ చర్యలు చేపట్టాలని రెండు నెలలుగా కార్మికులు మొత్తుకుంటున్నా యాజమాన్యం పట్టించుకోలేదని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. ప్రమాదం గురించి ముందస్తు హెచ్చరికలను సైతం యాజమాన్యం బేఖాతరు చేసిందంటే ఏమనుకోవాలి? బాయిలర్ పేలి, 1300 డిగ్రీల ఉష్ణాన్ని పుట్టించే కెమికల్ మిశ్రమం శరీరంపై పడి కార్మికులు పడుతున్న నరకయాతన మాటలకందనిది! తీవ్రంగా గాయపడిన 16 మందిలో ఇప్పటికే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ప్రమాదానికి గురైన కార్మికుల కుటుంబాలకు వెంటనే సమాచారం ఇవ్వడంలోనూ అదే నిర్లక్ష్యం. ఫ్యాక్టరీలో ప్రమాదం దగ్గర నుంచి తాళాలు వేసి యాజమాన్యం పరారయ్యే దాకా ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వం సరిగా వ్యవహరించలేదు. యాజమాన్యాన్ని విడిచిపెట్టి బాధితులపై తప్పుడు సెక్షన్లతో కేసులు పెడుతున్నారు.

పారిశ్రామిక కేంద్రంగా పిలవబడే విశాఖ జిల్లాలో... గత ఐదేళ్లలో 119 ప్రమాదాల్లో 120 మంది కార్మికులు మరణించారు. 2022లోనే 20 మంది మరణించగా, 18 మంది క్షతగాత్రులై మంచంపట్టారు. అనకాపల్లి జిల్లాలో 2021-23 మధ్య 27 పారిశ్రామిక ప్రమాదాల్లో 28 మంది బలయ్యారు. పరవాడ ఫార్మాసిటీలోనే పదేళ్లలో 40 మంది మరణించగా, 152 మంది క్షతగాత్రులయ్యారు. 2020 నాటి ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదం 12 మందిని బలిగొనగా, 600 మంది ఆసుపత్రుల పాలయ్యారు. అదే ఏడాది షిప్‌యార్డ్ క్రేన్ కూలి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. 2023లో కాకినాడ జిల్లాలోని ఆయిల్ ప్యాకేజి పరిశ్రమలో 24 అడుగుల ఎత్తున్న నూనె ట్యాంకులో దిగిన ఏడుగురు కార్మికులు బలయ్యారు. అంతకుముందు ఏడాది ఏలూరు జిల్లా అక్కిరెడ్డిగూడెం పోరస్ కర్మాగారంలో ప్రమాదం ఏడుగురి ప్రాణాలు తీసింది.

దేశంలో 2017-20 మధ్య జరిగిన ప్రమాదాల లెక్కల ప్రకారం.. ఏటా 1109 మంది మరణిస్తుండగా, నాలుగు వేల మందికిపైగా క్షతగాత్రులవుతున్నారు. రోజూ కనీసం ముగ్గురు కార్మికులు మరణిస్తున్నా... కార్పొరేట్ల సేవలో తరిస్తున్న పాలకుల్లో చలనం లేదు. తనిఖీలను తగ్గించి, స్వీయ ధ్రువీకరణలను అనుమతించడం ద్వారా భద్రతాపరమైన నియంత్రణలను బలహీనపరచడం అన్ని అనర్థాలకూ కారణమని అంతర్జాతీయ కార్మిక సమాఖ్య పదేపదే హెచ్చరిస్తున్నా.పాలకుల చెవికెక్కడం లేదు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ, కార్మికుల భద్రతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా గాలికొదిలేశాయి. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ రసాయనాల శుద్ధి, పర్యావరణ పరిరక్షణకు, వాతావరణంలో విషవాయువుల మోతాదు తగ్గించడానికి గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాల్సిన డెవలపర్ అది తన బాధ్యత కాదన్నట్టు వ్యవహరించారు. ఇప్పటికైనా భారీ పరిశ్రమలన్నింటిలో సేఫ్టీ ఆడిట్ చేయించాలి. పని పరిస్థితులను మెరుగుపరచాలి. పారిశ్రామిక ప్రమాదాలు తరచూ జరిగే జగ్గయ్యపేట, విశాఖ తదితర ప్రాంతాల్లో వంద పడకల బర్న్సు వార్డుతో కూడిన ఆసుపత్రులు నిర్మించాలి. ప్రతి పరిశ్రమలో ప్రతి నెలా తనిఖీలు జరిపి, భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలి. ఎల్‌జి పాలిమర్స్ ప్రమాద సమయంలో ఇచ్చినట్లే కోటి రూపాయలు చొప్పున పరిహారం ఇచ్చి మృతుల కుటుంబాలను ఆదుకోవాలి. సకల ప్రమాదాలకు మూలమైన కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టేందుకు కార్మిక వర్గం కలసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరముంది.

మహనీయుని మాట



విజ్ఞానాన్ని పొందాలనుకుంటే దానికై పరిశ్రమించక తప్పదు. శ్రమపడటం అనేదే జీవన సూత్రం.

- జాన్ రస్కిన్, ఆంగ్ల రచయిత, తత్వవేత్త.



విశ్లేషణ

సంఘీభావంతోనే సమైక్యత

2024 సాధారణ ఎన్నికల్లో కేంద్రంలో బిజెపికి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. 'ఇండియా' బ్లాక్ కొత్త శక్తిగా అవతరించింది. ఇందులో ముఖ్య పాత్ర పోషించిన వామపక్షాల పరిస్థితి కాస్త మెరుగైంది. అయినా ప్రజా పునాది బలహీనపడుతూనే వుంది. మన రాష్ట్రంలో ఏజెన్సీలో పుంజుకున్న సిపిఐ(యం) మిగతా ప్రాంతాల్లో ఆశించిన ఓట్లు సాధించలేదు. కమ్యూనిస్టు అభిమానులు, శ్రేయోభిలాషులు నిరాశతో వున్నారు. డబ్బు, అధికార బలంతోపాటు సోషల్ ఇంజనీరింగు, పొలిటికల్ స్ట్రాటజిస్టులను ఉపయోగించుకుని బడా కార్పొరేట్ల మద్దతు వున్న పార్టీలు బలపడ్డాయి. వాటి మాదిరి కార్మికుల, రైతు కూలీల మద్దతుపై ఆధారపడిన కమ్యూనిస్టులు పుంజుకోలేదు. ఈ శక్తులు అసంఘటితంగా ఉండడం, కార్మిక, కర్షక, సామాజిక ఉద్యమాలు బలహీనంగా వుండడం ప్రజల ఆలోచనలను రకరకాల ఆశలు పెట్టి తమ వెనుక సమీకరించుకోవడం, వారిని ప్రభావితం చేయగలిగిన రీతిలో సాంస్కృతికోద్యమం లేకపోవడం ప్రధాన అవరోధంగా వున్నాయి. ప్రజలకు తమ మీద తమకు విశ్వాసం పెరిగితే కమ్యూనిస్టుల్ని బలపరుస్తారు. దానికి సాధనం సంఘీభావ ఉద్యమాలు. తమ సమస్యల పరిష్కారానికి ఎవరికి వారు ఐక్యంగా పోరాటాలు సాగిస్తూనే ఇతరులకు అండగా వుండాలన్న స్పృహ పెరగాలి.

దేశంలో గత 30 సంవత్సరాలుగా అమలవుతున్న సరళీకరణ ఆర్థిక విధానాలు దేశ ప్రజల ఐక్యతను చిన్నాభిన్నం చేశాయి. కార్పొరేట్లు బలపడ్డారు. సంఘటితమయ్యారు. తమ అధికారాన్ని నిలబెట్టుకోడానికి మతాన్ని సాధనంగా వాడుకున్నారు. మోడీ వెనుక సమీకృత మయ్యారు. సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలు ప్రభుత్వాల అండతో కార్పొరేట్లు పైచేయి సాధించారు. శ్రామిక ప్రజలు సంఘటిత శక్తి బలహీనపడింది. కమ్యూనిస్టు పార్టీలు బలహీనపడ్డాయి. పార్లమెంటు, అసెంబ్లీలో వామపక్షాల బలం తగ్గడం వల్ల శ్రామిక వర్గం తరపున మాట్లాడే గొంతుక మూగబోయింది. పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాలు దీన్నే ప్రతిబింబిస్తున్నాయి. ఈ స్థితిలో పార్లమెంటు వెలుపల జరిగే పోరాటాలకు మరింత ప్రాధాన్యత పెరిగింది. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ పోరాటం ప్రభుత్వ మెడలు వంచగలిగింది. ఈ పోరాట క్రమంలో కార్మిక-కర్షక శక్తి బలపడింది. మారుతున్న పరిస్థితులకు ఇది అద్దం పడుతుంది.



వి. శ్రీనివాసరావు

విచ్ఛిన్నకర ఎత్తుగడలు

బిజెపి అధికారం చేపట్టాక మత విద్వేషాలు పెరిగాయి. అగ్రకుల దురహంకారం విస్తరించింది. అణగారిన వర్గాల మధ్య చీలికలొచ్చి ప్రతిఘటించే శక్తి తగ్గిపోయింది. అస్తిత్వవాదం ప్రభావంతో కులాలు, ఉప కులాలు, ఉప తెగలు, ప్రాంతాలు, మతాలు ఇలా చీలి చీలి సామూహిక శక్తి సన్నగిల్లి వ్యక్తిగత వాదం ముందుకొచ్చింది. నీ సంగతి నీవు చూసుకో...సమాజం గురించి నీకెందుకంటూ రాజకీయ రహితం చేశారు. కులాలు, ఉపకులాలు, తెగలు, ఉపతెగల

ఐక్యతా భావం పెరగాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. చిన్నవి, పెద్దవి ఎవరికి వారు విడివిడిగా చేసే ఏ పోరాటానికైనా ఇతరుల మద్దతు తీసుకోవాలి. పోరాటంలో లేని వర్గాలు, తరగతులు తమ తోటి శ్రామికులు చేసే పోరాటాలకు అండగా నిలబడాలి. ఈ సంఘీభావ చైతన్యాన్ని పెంచే బాధ్యతను కార్మిక సంఘాలు తమ భుజస్కందాలపై వేసుకోవాలి. విద్యార్థులు, ఇలాంటి న్యాయమైన పోరాటాలకు స్పందించాలి. మద్దతుగా నిలబడాలి. కార్మికులకు కార్మికుల సంఘీభావమే కాదు, రైతాంగం, వ్యవసాయ కూలీలు, వృత్తిదారుల పోరాటాలకు కూడా కార్మికవర్గం అండగా నిలబడాలి. దళితులు, ఆదివాసీలు, మహిళలపై దాడులు, అత్యాచారాలు జరిగినప్పుడు స్పందించాలి.



పేరిట తమకు అనుకూలమైన నాయకుల్ని సృష్టించారు. కార్మికులకు బేరమాడే శక్తి తగ్గింది. ఉద్యోగ స్వభావంలో అనేక మార్పులు ప్రవేశ పెట్టారు. శాశ్వత ఉద్యోగాల స్థానంలో క్యాజువల్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, టైమ్ బేస్డ్, పీస్ వర్క్, వర్క్ ఫ్రమ్ హోం, హోమ్ బేస్డ్ వర్క్ ఇలా రకరకాలుగా కార్మికులు, ఉద్యోగులను చీల్చేశారు. గిగ్, ప్లాట్‌ఫామ్ ఉద్యోగుల సంఖ్య పెంచుతోంది. వీరంతా అసంఘటిత వర్గం. ఒకరి సమస్యను మరొకరు పట్టించుకునే ధోరణి తగ్గింది. ఎవరి సంగతి వారు చూసుకోండని కార్మికులు, ఉద్యోగులను యాజమాన్యాలు ప్రోత్సహించాయి. పని (పెర్‌ఫార్మెన్స్) ఆధారంగా జీతభత్యాలు నిర్ణయిస్తున్నారు. యూనియన్లను గుర్తించడానికి నిరాకరిస్తున్నారు. ఒకవేళ గుర్తించినా బయటి నాయకులు రాకూడదని షరతులు విధిస్తున్నారు. తప్పనిసరైతే తమకు అనుకూలంగా వుండే అవినీతికర, అవకాశవాద, సంస్కరణవాద నాయకత్వాలను ప్రోత్సహిస్తున్నారు. పరిశ్రమలను ఆనుకొని ఉండే గ్రామాల్లో పెత్తందార్లు, కుల నాయకుల్ని పోషించి వారి మద్దతు కూడగడుతున్నారు. వీరు కార్మికుల్ని అదుపు చేస్తుంటారు. కార్మికుల మధ్య కులాలు, ప్రాంతాల కుంపటి రగిల్చింది. నిరుద్యోగాన్ని ఆసరా చేసుకొని మహిళల రక్తమాంసాలు పిండుతున్నది. ప్రశ్నిస్తే ఉన్న ఉపాధి పోతుందన్న భయాన్ని సృష్టించారు. తమ దయతో ఉపాధి కల్పిస్తున్నామన్న భావనను కల్పించారు. ఉపాధి కల్పించడానికే పరిశ్రమలకు రైతుల భూములను తీసుకొంటున్నట్లుగా ఊదరగొడుతున్నాయి. తత్ఫలితంగా సంఘటిత కార్మికోద్యమం బలహీనపడడంతో బడా పెట్టుబడిదార్ల దోపిడీకి అంతు లేకుండా పోయింది. దోపిడీతోపాటు తమ రాజకీయ అధికారాన్ని సంఘటితం చేసుకున్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా విధానం అదే. ఈ ఎన్నికల్లో సోషల్ ఇంజనీరింగు, డబ్బు పంపిణీ శిఖరాగ్ర స్థాయికి చేరింది. ప్రజల్ని ముక్కలు ముక్కలుగా చీల్చడమే సోషల్ ఇంజనీరింగ్. డబ్బు వెదజల్లి ఎవరికి వారిని విడివిడిగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం కన్పిస్తుంది. ఒకరు ఉద్యమిస్తుంటే మరొకరు మనకెందుకులే అని పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ బలహీనతను ఆసరా చేసుకొని పాలకులు ప్రజలను నియంత్రిస్తున్నారు. దాని విశ్వరూపాన్ని ఈ ఎన్నికల్లో మనం ప్రత్యక్షంగా చూశాం.

మార్కెట్ సంస్కృతి

సంపద కేంద్రీకరణ పెరిగింది. అప్పులు చేసైనా సరుకులు కొనుగోలు చేసే యంత్రాలుగా మనుషులను మార్చేసింది. అవసరాలకు తోడు ఆడంబరాలు అలవాటు చేసింది. ముందస్తుగా అప్పులు చేసి సరుకులు కొనే మార్కెట్ సంస్కృతి విస్తరించింది. చేసిన అప్పులను తీర్చుకోవడానికి అదనపు సమయం పని చేయడం, ఒకేసారి రెండు మూడు రకాల పని చేయడం, డ్వాక్రా, మైక్రో ఫైనాన్సు సంస్థల్లో లోన్లు తీసుకొని కిస్తీలు కట్టడం, క్రెడిట్ కార్డుల ద్వారా ఇఎంఐలు కట్టుకోవడం వంటి అనేక పద్ధతులు ప్రవేశించాయి. క్షణం తీరిక లేకుండా మనుషుల జీవనాడుల్ని పీల్చేశాయి. ఈ పరిణామాలతో ముఖ్యంగా మధ్యతరగతి ఉద్యమాల నుండి దూరమవుతున్నారు.

ప్రజల ఆలోచనా తీరునే మార్చేందుకు ఒక పద్ధతి ప్రకారం ఈ ముప్పై ఏళ్ళు ఈ వ్యవస్థ ప్రయత్నించింది. యువత, విద్యార్థుల్లో సామాజిక స్పృహను దెబ్బకొడుతున్నారు. సంస్కరణల ద్వారా వస్తున్న మార్పులు, తమ ఆలోచనల్లో వస్తున్న మార్పులు గుర్తించలేక మార్కెట్‌లో పోటీపడి పరుగులుతీసే ధోరణి పెరిగింది. ఎవరో ఒకరు అభివృద్ధి అయినా, సంపాదించుకున్నా వారిని రోల్‌మోడల్‌గా (సెలబ్రిటీ) చూపెట్టి మిగతా వారిని పరిగెత్తిస్తున్నారు. తాము ఎందుకు పరుగెడుతున్నామో కూడా ఆలోచించలేనంత వేగంగా పోటీలు పెట్టి పరుగులు తీయిస్తున్నారు. ఈ వ్యవస్థ పట్ల నిరంతరం ఆశలు పెంచుతూ వెనకబడ్డవారిని అశక్తులుగా, అసమర్థులుగా, చేతకానివారిగా బ్రాండ్ వేసి నిరాశకు గురిచేసి ఆత్మహత్యలు చేసుకునే స్థితికి నెట్టేస్తున్నది.

కార్పొరేట్ బ్రాండ్ల బాటలో పార్టీలు

ప్రజలు కలిసికట్టుగా పాలకులపై పోరాడకుండా తమలో తామే కలహించుకునేందుకు అనేక వైరుధ్యాలను, వైషమ్యాలను సృష్టిస్తున్నారు. ప్రజల్లోని ఒక వర్గం బాధలకు, సమస్యలకు ఆ ప్రజల్లోనే మరొక వర్గం కారణం అంటూ ముందుకు తెస్తున్నారు. మధ్యలో పాలకులు పెద్ద మనుషుల్లాగా చలామణి అవుతున్నారు. పాలకుల పెత్తనాన్ని కొనసాగించేందుకు వారి చేతనే పోషించబడుతున్న కొన్ని రాజకీయ పార్టీలు పని చేస్తున్నాయి. ఒక పార్టీపై వ్యతిరేకత వస్తే మరొక పార్టీని ఛాంపియన్‌గా ముందుకు తెస్తున్నారు. ఒకసారి వైఫల్యం అయిన పార్టీ మరొకసారి విజేతగా ముందుకొస్తున్నది. నేడు రాజకీయాలను బడా కార్పొరేట్ కంపెనీలు శాసిస్తున్నాయి. కంపెనీలు ఉత్పత్తి చేసే బ్రాండ్ల మాదిరే కార్పొరేట్ అనుకూల రాజకీయ పార్టీలు తయారవుతున్నాయి. ఒక బ్రాండ్‌కు మార్కెట్ తగ్గిపోతే అదే కంపెనీ మరొక బ్రాండ్‌తో మార్కెట్ లోకి ప్రవేశించి వినియోగదారులను మోసం చేయడం చూస్తున్నాం. మార్కెట్ బాగా ఉన్నప్పుడు పోటీ పడే కంపెనీలే సంక్షోభం వచ్చినప్పుడు రాజీ పడి ప్రజలపై ఆ భారాన్ని మోపుతున్నాయి. జియో సహా టెలికం చార్జీల పెంపు తాజా ఉదాహరణ. రాజకీయాల్లోనూ ఇదే ఎత్తుగడలు ప్రయోగిస్తున్నారు. ప్రజలు ఈ సుడిగుండంలో పడిపోతున్నారు.

డబ్బు ఆధిపత్యంపై పోరాడాలి

రోజూ డబ్బు (పెట్టుబడి) ఆధిపత్యంపై పోరాడుతున్న కార్మికవర్గం కూడా డబ్బుకు లోబడి తిరిగి రాజ్యాధికారాన్ని వాళ్ళకే అప్పజెప్తున్నది. వాళ్ళలోనే ఒకరికి మరొకరిని ప్రత్యామ్నాయంగా భావించి తామే ప్రత్యామ్నాయమన్న భావనను మర్చిపోతున్నారు. తమ సొంత రాజకీయ పార్టీని - కమ్యూనిస్టులు - వదిలేస్తున్నారు. మేక పిల్లను కుక్కపిల్లగా దొంగలు చేసిన ప్రచారాన్ని నమ్మి మోసపోయిన పురోహితుని కథ ఇక్కడ వర్తిస్తుంది. ఫలితంగా తమ పోరాట శక్తి మీదే తాము విశ్వాసాన్ని కోల్పోతున్నారు.

ఐక్యతే ఆయుధం

పెట్టుబడిదారులు ఎలా ఒక పథకం ప్రకారం ప్రజల్ని చీల్చారో దానిని ఎదుర్కొనేందుకు శ్రామిక ప్రజలు కూడా చైతన్యయుతంగా ఐక్యతను సాధించాలి. ఏ తరగతికా తరగతి, ఏ వర్గానికా వర్గం, ఏ మతానికా మతం, ఏ కులానికా కులం విడివిడిగా పోరాడి దేన్నీ సాధించలేరు. విడివిడిగా పోరాటాలు చేస్తూనే కలిసి ఎదుర్కొనే మార్గాలను అన్వేషించాలి.

ఐక్యతా భావం పెరగాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. చిన్నవి, పెద్దవి ఎవరికి వారు విడివిడిగా చేసే ఏ పోరాటానికైనా ఇతరుల మద్దతు తీసుకోవాలి. పోరాటంలో లేని వర్గాలు, తరగతులు తమ తోటి శ్రామికులు చేసే పోరాటాలకు అండగా నిలబడాలి. ఈ సంఘీభావ చైతన్యాన్ని పెంచే బాధ్యతను కార్మిక సంఘాలు తమ భుజస్కందాలపై వేసుకోవాలి. విద్యార్థులు, ఇలాంటి న్యాయమైన పోరాటాలకు స్పందించాలి. మద్దతుగా నిలబడాలి. కార్మికులకు కార్మికుల సంఘీభావమే కాదు, రైతాంగం, వ్యవసాయ కూలీలు, వృత్తిదారుల పోరాటాలకు కూడా కార్మికవర్గం అండగా నిలబడాలి. దళితులు, ఆదివాసీలు, మహిళలపై దాడులు, అత్యాచారాలు జరిగినప్పుడు స్పందించాలి.


నేటి పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచవ్యాపితంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. మన దేశంలోనూ దాని ఛాయలు కనిపిస్తున్నాయి. అనేక దేశాల్లో ఉద్యమాలు పెరుగుతున్నాయి. ప్రజా వ్యతిరేక పాలకులు మారిపోతున్నారు. తిరుగులేదనుకున్న బిజెపి, మోడీ మైనారిటీలో పడ్డారు. రాముడి పేరు చెప్పినా ఓట్లు వేయని స్థితి వచ్చింది. పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభానికి దీనికి సంబంధం లేదనుకోలేం. గత ఎన్నికల్లో కుల, మత భావనలను అధిగమించి ప్రజలు బిజెపికి వ్యతిరేకంగా ఓటేయడానికి ప్రధాన కారణం నిరుద్యోగం, ధరలు పెరగడమే. ఈ సమస్యలను పరిష్కరించుకోడానికి ప్రజలను అనుమతించ కుండా నిర్బంధానికి పూనుకున్నారు. ప్రజాస్వామ్య హక్కులు హరించారు. రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేశారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. తత్ఫలితమే మోడీ రాజకీయ నైతిక ఓటమి. గెలిచి ఓడిపోయిన స్థితిలో మోడీ ఉన్నారు. ప్రజల్లో వస్తున్న ఈ మార్పు శుభసూచికం. పాలకవర్గాల దోపిడీని అడ్డుకునేందుకు శ్రామిక వర్గాలు చొరవ తీసుకొని ముందుకు రావాలి. పార్టీలకతీతంగా లౌకిక, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు అన్ని శక్తులూ కదలాలి. వివిధ వర్గాల, తరగతుల ప్రజల మధ్య సంఘీభావ చైతన్యమే ఐక్యతకు పునాది అవుతుంది.

/ వ్యాసకర్త సిపిఎం ఎ.పి రాష్ట్ర కార్యదర్శి /

అంతర్జాతీయం

ట్రంప్‌పై హత్యాయత్నం

అమెరికా ప్రజాస్వామ్యానికి ముప్పు ఎవరి నుంచి?



"అమెరికా మీద దాడి జరుగుతోంది, ముట్టడిలో ఉంది, ప్రజాస్వామ్యాన్ని హతమార్చేందుకు చూస్తున్నారు. చీకటి అధ్యాయానికి నాంది" మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హత్యాయత్నంపై వెలువడిన తక్షణ వ్యాఖ్యలివి. అతగాడు ప్రాణాపాయం నుంచి కొద్దిలో తప్పించుకున్నాడు. శనివారం నాడు అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రం బట్లర్ అనే పట్టణంలో ఎన్నికల సభలో ప్రసంగిస్తుండగా ఒక దుండగుడు జరిపిన కాల్పులో ట్రంప్‌కు కుడి చెవి దగ్గర బుల్లెట్ గాయం తగిలింది. దుండగుడి కాల్పుల్లో సభికుల్లో ఒకరు మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. హంతకుడిని వెంటనే భద్రతా దళాలు కాల్చి చంపాయి. సభ సమీపంలోని ఒక భవనంపై మాటు వేసి కాల్పులు జరిపినట్లు వెల్లడైంది. ఈ ఉదంతం తరువాత అమెరికా రాజకీయాలు, ఎన్నికల్లో ఏం జరగనుందనే చర్చ మొదలైంది. దీనికి ముందు డెమోక్రటిక్ అభ్యర్థి జోబైడెన్ వృద్ధాప్యం గురించి, పోటీ నుంచి తప్పుకొని ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ లేదా మరొకరికి అవకాశం ఇవ్వాలనే చర్చ జరుగుతోంది. హత్యాయత్నంతో సానుభూతి తలెత్తి ట్రంప్ విజయావకాశాలు మెరుగుపడినట్లు సర్వేలు పేర్కొంటున్నాయి. ప్రజాస్వామ్యంలో పార్టీల నేతలు, ఎన్నికల్లో అభ్యర్థులపై జరిగే దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలి. ఎన్నికల్లో ప్రత్యర్థి జో బైడెన్ వెంటనే ఖండించాడు. ట్రంప్‌పై దాడిని వివిధ దేశాల నేతలు ఖండించారు. దుండగుడు ఇరవై ఏళ్ల థామస్ మాథ్యూ క్రూక్స్ రిపబ్లికన్ పార్టీ మద్దతుదారుగా నమోదై ఉన్నాడు. గతంలో డెమోక్రటిక్ పార్టీకి విరాళం ఇచ్చిన దాఖలా కూడా వెల్లడైంది. ఎందుకు కాల్పులు జరిపాడో వెంటనే తెలియలేదు. క్రూక్స్‌కు తొలిసారిగా ఓటు హక్కు వచ్చింది. తాను ట్రంప్‌ను, రిపబ్లికన్ పార్టీని కూడా వ్యతిరేకిస్తున్నట్లు అతడు చెప్పాడన్న వార్తలు కూడా వచ్చాయి. కేవలం ఈ మాత్రానికే దాడికి పాల్పడతాడా? దీని వెనుక డెమోక్రటిక్ పార్టీ, ట్రంప్ మరోసారి అధికారానికి రాకూడదని కోరుకుంటున్న ప్రభుత్వంలోని వారు, రష్యా, చైనా, ఇరాన్, ఉత్తర కొరియా దేశాల హస్తం ఉండవచ్చా అనే సందేహాలను కూడా కొందరు లేవనెత్తినట్లు చెబుతున్నారు. దుండగుడికి ఎలాంటి నేర చరిత్ర లేదని న్యూయార్క్ టైమ్స్ పేర్కొన్నది. ఉగ్రవాదం నుంచి కూడా పెట్టుబడిదారులు ఎలా లాభాలు పొందుతారో ట్రంప్‌పై కాల్పుల ఉదంతం వెల్లడించింది. ఈ ఉదంతం తరువాత ట్రంప్ మీడియా, టెక్నాలజీ గ్రూపు కంపెనీల వాటాల ధరలు సోమవారం నాడు 55 శాతం పెరిగాయి. ఒక దశలో 71 శాతాన్ని తాకాయి. ఈ కారణంగా ట్రంప్ సంపద విలువ ఒక్క రోజులోనే రెండు బిలియన్ డాలర్లు పెరిగింది. ఈ కంపెనీ ట్రంప్ సామాజిక మాధ్యమ ప్రచారాన్ని నిర్వహించే ట్రూత్ సోషల్ వేదికను కూడా నిర్వహిస్తున్నది. అనేక కంపెనీల వాటాల ధరలు కూడా పెరిగాయి. దీని అర్థం ఏమిటి? ట్రంప్ ఎన్నిక అవకాశాలు పెరిగినట్లు పెట్టుబడిదారులు భావించటమే దీనికి కారణం. ట్రూత్ సోషల్‌ను అనుసరించే వారు కూడా గణనీయంగా పెరగటంతో నష్టాల్లో ఉన్న ఈ కంపెనీ రానున్న రోజుల్లో లాభాల బాట పట్టినట్లే. తుపాకులు, తూటాలు తయారు చేసే కంపెనీల వాటాల ధరలు కూడా పెరిగాయి.

ట్రంప్‌పై దాడి గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్న వారిలో కొందరు మూడు సంవత్సరాల క్రితం 2021 జనవరి ఆరవ తేదీన అమెరికా అధికార కేంద్రంపై దాడికి తన మద్దతుదార్లను పంపిన డోనాల్డ్ ట్రంప్ నిర్వాకాన్ని విస్మరించారు. ట్రంప్‌పై దాడి వ్యక్తిగతం, కానీ అతగాడి మద్దతుదార్ల చర్య మొత్తం అమెరికా అధికార, ప్రజాస్వామిక వ్యవస్థనే అపహాస్యం పాలు చేసిందనే అంశాన్ని మరిచిపోరాదు. అమెరికా, దాని ప్రజాస్వామ్యం మీద అసలైన దాడి అది.అమెరికాలో నలుగురు అధ్యక్షులను తుపాకి తూటాలు బలితీసుకున్నాయి. కొంత మంది అధ్యక్షులు త్రుటిలో తప్పించుకున్నారు. ఇటీవలి కాలంలో రాజకీయపరమైన దాడులు మరింతగా పెరుగుతున్నాయి. కానీ దేశ అధికార కేంద్రంపై ట్రంప్ నాయకత్వంలో జరిగిన దాడి చరిత్రలో అదే మొదటిది. తాను ఓడిపోతే ఫలితాలను అంగీకరించేది లేదని ముందుగానే అపర ప్రజాస్వామికవాది

అక్కడ ... సామాజిక వైరుధ్యాలు పెరుగుతున్నాయి. ఎవరు ఎవరిని ఎప్పుడు ఎందుకు కాల్చి చంపుతారో తెలియదు. తుపాకి లేకుండా జనాలు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. తుపాకి సంస్కృతిని పెంపొందించటం, వాటిని తయారు చేసే కార్పొరేట్లకు లాభాలు సమకూర్చటంలో డెమోక్రాట్లు, రిపబ్లికన్లు ఎవరూ తక్కువ తినలేదు. పామును పాలు పోసి పెంచిన చేతినే అది కాటు వేస్తుంది. అందువలన ఆ తుపాకులకు ఎప్పుడు ఎవరు బలౌతారో చెప్పలేని అయోమయ స్థితి నేడు అమెరికాలో ఉంది. ఒక దుండగుడు కాదు, అలాంటి వారిని తయారు చేసిన వ్యవస్థ, దాన్ని కాపాడుతున్నవారే ప్రజాస్వామ్యానికి అసలైన ముప్పు.

ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఓడిపోయిన తరువాత విజేతను అధికారికంగా ప్రకటించేందుకు ఏర్పాటు చేసిన పార్లమెంటు ఉభయ సభల సమావేశాన్ని జరగకుండా చూసేందుకు, జో బైడెన్ గద్దెనెక్కకుండా చేసేందుకు ట్రంప్ చేసిన కుట్రలో భాగమది. అంతే కాదు దేశీయ ఉగ్రవాదం అనే కోణంలో ఎఫ్‌బిఐ, ఇతర చట్టాన్ని అమలు జరిపే సంస్థలు చూశాయి. దాడికి ముందు అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌కు కొద్ది దూరంలో తన మద్దతుదారులతో సమావేశం జరిపిన ట్రంప్ కాపిటోల్‌ను ఆక్రమించాలని, ఎన్నిక నిర్ధారించే పత్రాన్ని ఇవ్వకుండా అడ్డుకోవాలని రెచ్చగొట్టి పంపించాడు. ఈ కేసులో కొంత మందికి శిక్షలు పడినప్పటికీ డోనాల్డ్ ట్రంప్‌పై విచారణ కొనసాగుతూనే ఉంది. ఎన్నికల లోపు పూర్తయ్యే అవకాశం లేదు, ఒకవేళ ట్రంపు గెలిస్తే అసలు విచారణే ఉండకపోవచ్చు, ఓడితే వచ్చే ఏడాది జరగవచ్చు.

ట్రంప్‌పై దాడి ప్రపంచానికి చూపుతున్నదేమిటి ? అమెరికాలో రాజకీయ విభజన కారణంగా రాజకీయ హింస కూడా పెరుగుతున్నది. దాడి వెనుక మూడు కారణాలున్నట్లు ఒక అభిప్రాయం. ఒకటి, ట్రంప్ గెలవకూడదని కోరుకుంటున్న ప్రభుత్వంలోని వారి హస్తం, ట్రంప్ వంటి పచ్చి మితవాది అధికారానికి రాకూడదని కోరుకుంటున్న వామపక్ష తీవ్రవాద శక్తులు, ఎవరితో ప్రమేయం లేకుండా ట్రంప్ మీద తలెత్తిన వ్యక్తిగత ఆగ్రహం కారణంగా కాల్పులు జరిపి వుండవచ్చని చెబుతున్నారు. ఈ కారణాలతో రానున్న రోజుల్లో మరిన్ని ప్రయత్నాలు జరగవచ్చన్న హెచ్చరికలు వెలువడ్డాయి. అమెరికా చరిత్రలో రాజకీయ హింసాకాండ నేతలపై దాడి జరగడం ఇదే మొదటిసారి కాదు.

అమెరికా రాజకీయ ముఖచిత్రాన్ని చూసినట్లయితే కొన్ని అంశాలలో తేడాలున్నప్పటికీ డెమోక్రటిక్, రిపబ్లికన్ పార్టీలు రెండూ అక్కడి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పాటుపడేవే. ఇటీవలి కాలంలో రెండు పార్టీల వైఫల్యాలు గతం కంటే ఎక్కువగా జనం నోళ్లలో నానుతున్నాయి. ప్రపంచంలో అమెరికా పెత్తనాన్ని సాగించేందుకు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి, పరువు పోతున్నది. ఎన్నికల సమయంలో వ్యక్తిగత బలహీనతలు, అవినీతి అక్రమాలను బయటపెట్టుకోవటం ఇటీవలి కాలంలో పెరుగుతున్నది. విధానపరమైన వైఫల్యాలు రెండు పార్టీల్లో ఉండటమే దీనికి కారణం. ఈ పూర్వరంగంలోనే మూడవ అభ్యర్థికి మద్దతు ఇవ్వటం గురించి అమెరికా సమాజంలో చర్చ ప్రారంభమైంది. కాల్పుల నేపథ్యంలో గురువారం నాడు జరిగే ఒక సమావేశంలో ట్రంప్ అభ్యర్థిత్వాన్ని లాంఛనంగా పార్టీ ప్రకటించనుంది.

ట్రంప్ ప్రాజెక్టు 2015 పేరుతో ముందుకు తెస్తున్న ఎజెండా కార్మికవర్గం మీద దాడికి ఉద్దేశించిందని పురోగామి రాజకీయ బృందం హెచ్చరించింది. పౌరహక్కులకు ముప్పు ఏర్పడిందని ఆఫ్రో-అమెరికన్ల కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ట్రంప్ కోరిక మేరకు మితవాద హెరిటేజ్ ఫౌండేషన్ దీన్ని రూపొందించింది. దీన్ని అమలు జరిపేందుకు ట్రంప్ నియంతగా మారే అవకాశం ఉందని కూడా పేర్కొన్నది. తాను తిరిగి అధికారానికి వస్తే రాజ్యాంగంలోని కొన్ని సెక్షన్లను తొలగిస్తానని ఏడాది క్రితమే ట్రంప్ చెప్పిన అంశాన్ని గుర్తు చేసింది. తొమ్మిది దశాబ్దాల క్రితం చేసిన జాతీయ కార్మిక సంబంధాల చట్టాన్ని వెనక్కు తీసుకుంటామని ట్రంప్ తొలిసారి అధికారంలో ఉన్నప్పుడు నియమించిన బోర్డులో అత్యధికులు కార్మిక వ్యతిరేకులు ఉన్నారు. సోషలిజం విఫలమైందని గతంలో అమెరికా చెప్పింది. కానీ అదే అమెరికాలో ఇప్పుడు పెట్టుబడిదారీ విధానం విఫలమైందనే భావం విస్తరిస్తోంది. చైనా, వియత్నాం వంటి సోషలిస్టు దేశాలతో పోల్చి వేస్తున్న ప్రశ్నలకు సమాధానం లేదు. అక్కడ ధనిక-పేద వ్యత్యాసం పెరిగిపోతోంది. మధ్యతరగతి వర్గం కనుమరుగు అవుతోంది. ఆర్థిక, వలస కార్మికులను అనుమతించే విధానాలపై అసంతృప్తి పెరుగుతున్నది. ఈ పూర్వ రంగంలోనే సామాజిక వైరుధ్యాలు పెరుగుతున్నాయి. ఎవరు ఎవరిని ఎప్పుడు ఎందుకు కాల్చి చంపుతారో తెలియదు. తుపాకి లేకుండా జనాలు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. తుపాకి సంస్కృతిని పెంపొందించటం, వాటిని తయారు చేసే కార్పొరేట్లకు లాభాలు సమకూర్చటంలో డెమోక్రాట్లు, రిపబ్లికన్లు ఎవరూ తక్కువ తినలేదు. పామును పాలు పోసి పెంచిన చేతినే అది కాటు వేస్తుంది. అందువలన ఆ తుపాకులకు ఎప్పుడు ఎవరు బలౌతారో చెప్పలేని అయోమయ స్థితి నేడు అమెరికాలో ఉంది. ఒక దుండగుడు కాదు, అలాంటి వారిని తయారు చేసిన వ్యవస్థ, దాన్ని కాపాడుతున్నవారే ప్రజాస్వామ్యానికి అసలైన ముప్పు. 2021 జనవరి ఆరున తన గుంపును అమెరికా అధికార కేంద్రం మీద దాడికి ఉసిగొల్పిన ట్రంప్ నుంచే అసలైన ముప్పుకు నాంది. ఇలాంటి ట్రంపు, అతగాడి ఇతర వెర్రి వేషాలను కూడా అక్కడి మీడియా జనానికి చెప్పటం లేదు. ఇది కూడా అమెరికాకు ముప్పు తెచ్చేదే !



ఎం. కోటేశ్వరరావు

అక్కరకు రాని పిఎం కేర్స్!

- సగానికి పైగా దరఖాస్తుల తిరస్కృతి
- కారణం కూడా వెల్లడించని కేంద్రం

న్యూఢిల్లీ : కోవిడ్ వల్ల తల్లిదండ్రులను కోల్పోయి అనాధలుగా మిగిలిన పిల్లల బాగోగులు చూసేందుకు కేంద్రం తీసుకువచ్చిన పిఎం కేర్స్ పథకం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది.. ఈ పథకం కింద వచ్చిన దరఖాస్తుల్లో సగానికి పైగా దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు అధికారులు వెల్లడించారు. దీనికి నిర్దిష్ట కారణం కూడా వెల్లడించలేదు. దేశంలో కోవిడ్ విజృంభించిన సమయంలో అంటే 2021 మే 29న కేంద్రం పిఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ పథకాన్ని ప్రారంభించింది. చట్టబద్ధమైన సంరక్షకులను కోల్పోయినా లేదా దత్తత తీసుకున్న తల్లిదండ్రులు, కన్న తల్లిదండ్రులు ఎవరిని కోల్పోయినా ఆ పిల్లలకు తోడ్పాటునందించాలన్నది ఈ పథకం ఉద్దేశం. 2020 మార్చి 11 నుండి 2023 మే 5 మధ్య కరోనా మహమ్మారికి బలైన వారి పిల్లలకు ఇది వర్తిస్తుంది.

ఈ పథకం కింద 33 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలవ్యాప్తంగా 613 జిల్లాల నుండి 9,331 దరఖాస్తులు అందాయని అధికారిక డేటా వెల్లడించింది. అయితే వీటిలో 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 558 జిల్లాల నుండి వచ్చిన 4,532 దరఖాస్తులను మాత్రమే ఆమోదించారు. ఆమోదించిన సంఖ్య కన్నా ఎక్కువగా 4,781 దరఖాస్తులను తిరస్కరించారు. మరో 18 అప్లికేషన్లు ఆమోదం కోసం పెండింగ్‌లో వున్నాయని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి మీడియాకు తెలిపారు.

అయితే దరఖాస్తులను తిరస్కరించడానికి గల కారణాలేమిటో కూడా మంత్రిత్వ శాఖ వెల్లడించలేదు. రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌ల నుండి ఎక్కువ సంఖ్యలో అంటే వరుసగా 1553, 1511, 1007 దరఖాస్తులు అందగా వరుసగా 210, 855, 467 దరఖాస్తులు ఆమోదం పొందాయి.

అనాధలైన పిల్లల మంచి చెడులు చూసేందుకు స్థిరమైన రీతిలో వారికి సమగ్ర సంరక్షణ కల్పించాలన్నది ఈ పథకం లక్ష్యంగా వుంది. అంటే వారికి ఆరోగ్య బీమా కల్పించడం, విద్యనందించడం, వారికి 23ఏళ్లు వచ్చేవరకు ఆర్థిక తోడ్పాటునందించడం వంటి చర్యలు కేంద్రం తీసుకోవాల్సి వుంది. కానీ ఏకంగా 51శాతం దరఖాస్తులను తిరస్కరించారంటేనే ఈ పథకం ఏ రీతిన అమలు చేశారో అర్ధమవుతోంది.

కోవిడ్ వల్ల అనాధలైన వారే కాకుండా ఇతరత్రా తల్లిదండ్రులు లేని అనాధలందరికీ కూడా ఈ పథకం కింద ప్రయోజనాలు వర్తింపచేయాలని సుప్రీం కోర్టు గతంలోనే కేంద్రానికి సూచించింది.



యూరోపియన్ పార్లమెంట్ ప్రెసిడెంట్‌గా రెబెత్రా మెత్సోలా మరోసారి ఎన్నిక

న్యూఢిల్లీ : యూరోపియన్ పార్లమెంట్ ప్రెసిడెంట్‌గా మల్టా రాజకీయవేత్త రెబెత్రా మెత్సోలా మంగళవారం మరోసారి ఎన్నికయ్యారు. మంగళవారం ఎన్నికల్లో మొత్తం 623 ఎంఇపిల్లో మెత్సోలాకు 562 మంది మద్దతు లభించింది. దీంతో ఆమె ఈ పదవిలో 2027 జనవరి వరకూ కొనసాగుతారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన మరో అభ్యర్థి, స్పానిష్ మాజీ మంత్రి ఐరీన్ మోంటెరోకు కేవలం 61 మంది మాత్రమే ఓటు వేశారు. దీంతో యూరోపియన్ పార్లమెంట్ చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో మెత్సోలా విజయం సాధించినట్లయింది. ఈ సందర్భంగా మెత్సోలా మాట్లాడుతూ ఘర్షణ రాజకీయాలకు, రాజకీయ నాయకులపై హింసకు కారణమైన పోలరైజేషన్‌ను అధిగమించాలని యూరప్‌కు పిలుపునిచ్చారు. మల్టాలో 1979లో జన్మించిన రెబెత్రా 2013 నుంచి యూరోపియన్ పార్లమెంట్ సభ్యులు(ఎంఇపి)గా ఉన్నారు. 2020 నవంబర్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. 2022 జనవరి 11న అప్పటి ప్రెసిడెంట్ సస్సోలి మరణించడంతో యూరోపియన్ పార్లమెంట్‌కు తాత్కాలిక ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. 2022 జనవరి 18న ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. యూరోపియన్ పార్లమెంట్‌కు ప్రెసిడెంట్‌గా ఎన్నికైన మూడో మహిళగా నిలిచారు. గతంలో సిమోనె వెల్లి (1979నుంచి 1982 వరకూ), నికోల్ ఫోన్‌టైన్ (1999-2002) యూరోపియన్ పార్లమెంట్‌కు ప్రెసిడెంట్‌గా ఎన్నికైన మహిళలు.

కొండచరియలు విరిగిపడి కర్ణాటకలో ఏడుగురి మృతి

బెంగుళూరు : భారీ వర్షాలకు ఉత్తర కన్నడ జిల్లా అతలాకుతలంగా మారింది. జిల్లాలో రెండు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి ఏడుగురు మృతి చెందారు. వర్షాలకు జిల్లాలో అనేక ప్రాంతాల్లో రహదారులు కొట్టుకుపోయాయి. అనేక ప్రాంతాలు జలదిగ్భంధంలో మునిగిపోయాయి. అంకోలా తాలుకాలోని షిరూర్ సమీపంలో జాతీయ రహదారి 66పై కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రహదారిపై రాకపోకలు స్థంభించిపోయాయి. అలాగే జిల్లాలో వివిధ లోతట్టు ప్రాంతాలు, వర్షాభావ ప్రాంతాలు నుంచి 2,368 మందిని 26 పునరావాస కేంద్రాలకు తరలించారు. నిర్వాసితులకు ఆహారం, మందులు, మౌలిక వసతులు కల్పించారు.

కొత్త కెప్టెన్ ఎవరు?

- సెలక్షన్ కమిటీకి సరికొత్త సవాల్
- పొట్టి ఫార్మాట్‌కు హార్దిక్, సూర్య పోటీ
- వన్డే జట్టు పగ్గాల రేసులో రాహుల్
- నెలాఖరులో భారత జట్టు శ్రీలంక పర్యటన

ఆధునిక క్రికెట్‌లో టీమ్ ఇండియా తీయని తలనొప్పులు ఎదుర్కొంటుంది. భారత జట్టు నూతన నాయకత్వం ఎంపిక అందులో ఒకటి. టీ20 ప్రపంచకప్ విజయంతో పొట్టి ఫార్మాట్‌కు రోహిత్ శర్మ వీడ్కోలు పలికాడు. దీంతో ఈ ఫార్మాట్‌లో నాయకత్వ బాధ్యతలు అందుకునేందుకు వారసులు ఉవ్విళ్లూరుతున్నారు. 2025 చాంపియన్స్ ట్రోఫీ రేసులో సీనియర్ క్రికెటర్లు విశ్రాంతి లభించే ద్వైపాక్షిక సిరీస్‌ల్లో వన్డే జట్టు పగ్గాలు సైతం మరొకరికి అప్పగించాల్సి ఉంది. ఈ నెల 27 నుంచి శ్రీలంకతో మూడు టీ20లు, మూడు వన్డేల సిరీస్ ఆడనున్న టీమ్ ఇండియాకు కొత్త కెప్టెన్ల ఎంపిక ఇప్పుడు సెలక్షన్ కమిటీ ముందున్న కఠిన సవాల్!.


కెఎల్ రాహుల్ , శ్రేయస్ అయ్యర్


హార్దిక్ పాండ్య

పొట్టి ఫార్మాట్ వారసుడు ఎవరో?

ఐసిసి 2024 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్య. దీంతో సహజంగానే రోహిత్ శర్మ తర్వాత ఈ ఫార్మాట్‌లో హార్దిక్ పాండ్య సహజ వారసుడు. కానీ హార్దిక్ పాండ్య ఆల్‌రౌండర్. అతడి కెరీర్‌లో గాయాల బెడద ఎక్కువ. 2018 నుంచి భారత్ ఆడిన 122 వన్డేల్లో హార్దిక్ పాండ్య కేవలం 54 మ్యాచుల్లోనే ఆడాడు. వచ్చే ఏడాది కీలక ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ నేపథ్యంలో బిసిసిఐ పని ఒత్తిడి మేనేజ్‌మెంట్ ప్రణాళికలు చేయనుంది. ఈ ఫార్మాట్‌లో హార్దిక్ పాండ్యకు ఎక్కువగా విశ్రాంతి అందించే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడే సూర్యకుమార్ యాదవ్ పేరు తెరపైకి వస్తుంది. గత ఏడాది నవంబర్‌లో ఆస్ట్రేలియాపై 4-1తో టీ20 సిరీస్ విజయం సాధించిన భారత జట్టుకు సూర్య సారథ్యం వహించాడు. దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌లో నాయకత్వ పగ్గాలు చేపట్టి 1-1తో సిరీస్‌ను సమం చేసుకున్నాడు. వన్డే జట్టులోనూ సూర్యకుమార్ యాదవ్ క్రియాశీల సభ్యుడుగా కొనసాగే అవకాశం ఉంది. స్పెషలిస్ట్ బ్యాటర్‌గా సూర్యకుమార్ యాదవ్‌పై పెద్దగా పని ఒత్తిడి ఉండే అవకాశం లేదు. ఇది సూర్యకుమార్ యాదవ్‌కు టీ20 ఫార్మాట్ కెప్టెన్సీ అందించేందుకు దోహదం చేసే అవకాశం లేకపోలేదు. హార్దిక్, సూర్యతో పాటు బుమ్రా సైతం పోటీపడుతున్నా.. బుమ్రా వర్క్‌లోడ్‌తో అతడిని సెలక్షన్ కమిటీ పరిగణనలోకి తీసుకునే అవకాశం కనిపించటం లేదు.

ఆ ఇద్దరు శ్రీలంక వెళ్తారా?

భారత క్రికెట్ జట్టు చీఫ్ కోచ్‌గా గౌతం గంభీర్ నియమితులయ్యాడు. శ్రీలంకతో సిరీస్ నుంచి గంభీర్ బాధ్యతలు అందుకోనున్నాడు. ద్వైపాక్షిక సిరీస్‌లకు కీలక క్రికెటర్లు విశ్రాంతి తీసుకోవటంపై గతంలో గంభీర్ విమర్శలు చేశాడు. ఇప్పుడు చీఫ్ కోచ్‌గా గంభీర్ క్రికెటర్ల రొటేషన్, విశ్రాంతి అంశంలో ఏ నిర్ణయం తీసుకుంటాడో తెలియదు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి జనవరి వరకు భారత్ పది టెస్టు మ్యాచులు ఆడాల్సి ఉంది. ఐసిసి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ రేసులో టీమ్ ఇండియా ముందుంది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, జశ్‌ప్రీత్ బుమ్రా పది టెస్టులకు అందుబాటులో ఉంటారు. దీంతో రానున్న శ్రీలంకతో వన్డే సిరీస్ సహా పలు 50 ఓవర్ల ఫార్మాట్ సిరీస్‌లకు ఈ ముగ్గురు క్రికెటర్లు దూరంగా ఉండే అవకాశం లేకపోలేదు. చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టుకు రోహిత్ శర్మ కెప్టెన్సీ వహిస్తాడని బిసిసిఐ కార్యదర్శి ఇదివరకే ప్రకటించాడు. రోహిత్ శర్మ అందుబాటులో ఉండని వన్డే సిరీస్‌లకు టీమ్ ఇండియాకు నాయకుడు అవసరం. సెలక్షన్ కమిటీ రానున్న శ్రీలంక సిరీస్‌కే కొత్త వన్డే కెప్టెన్‌ను ఎంపిక చేయాల్సి ఉంటుంది.

కెఎల్ రాహుల్‌కు ఛాన్స్ ఉందా?

భారత జట్టు చివరగా డిసెంబర్‌లో వన్డే ఫార్మాట్‌లో ఆడింది. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో భారత్‌కు కెఎల్ రాహుల్ సారథ్యం వహించాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తే, రానున్న శ్రీలంక సిరీస్‌కు మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా కెఎల్ రాహుల్ జట్టులో చోటు సాధించే అవకాశం ఉంది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో వికెట్ కీపర్ బాధ్యతలు చేపట్టిన రాహుల్.. ఇక ఆ బాధ్యతలను రిషబ్ పంత్‌కు అప్పగించాల్సి ఉంటుంది. గతంలో రాహుల్, గంభీర్‌లు ఐపిఎల్ ఫ్రాంచైజీ లక్నో సూపర్‌జెయింట్స్‌కు పని చేశారు. ఇది రాహుల్‌కు ఉపయోగపడే అవకాశం ఉంది. యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ సైతం రేసులో నిలిచాడు. ఇటీవల యువ జట్టుతో జింబాబ్వే పర్యటనలో 4-1తో టీ20 సిరీస్ విజయం సాధించాడు. వన్డే జట్టులోనూ శుభ్‌మన్ గిల్ కీలక ఆటగాడు. దీంతో ఈ ఫార్మాట్‌లో రోహిత్ శర్మ వారసుడిగా శుభ్‌మన్ గిల్‌ను సైతం పరిగణించే పరిస్థితులు ఉన్నాయి.

అయ్యర్ వస్తాడా?

బిసిసిఐ సీనియర్ సెలక్షన్ కమిటీ ముందు మరో కఠిన సవాల్ ఉంది. వన్డే వరల్డ్‌కప్‌లో రెండు సెంచరీలు, మూడు అర్ధ సెంచరీలతో 500 పైచిలుకు పరుగులు సాధించిన శ్రేయస్ అయ్యర్.. ఆ తర్వాత బిసిసిఐ ప్రకటించిన వార్షిక కాంట్రాక్టు జాబితాలో చోటు గల్లంతు చేసుకున్నాడు. వెన్నునొప్పి బాధను జట్టు మేనేజ్‌మెంట్ అర్థం చేసుకోకుండా.. దేశవాళీ క్రికెట్‌లో ఆడాలని ఒత్తిడి చేసిందని గతంలో అయ్యర్ ఆవేదన వ్యక్తం చేశాడు. కోల్‌కత నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌ను భిన్న స్థాయికి తీసుకెళ్లాడు. కోల్‌కత నైట్‌రైడర్స్ మెంటార్ గంభీర్ ఇప్పుడు భారత చీఫ్ కోచ్ కావటంతో శ్రేయస్ అయ్యర్ కోసం అతడు పట్టుబట్టే అవకాశం లేకపోలేదు. వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ వన్డే జట్టులోకి వస్తాడా? లేదా సంజు శాంసన్‌కు అవకాశం ఇస్తారా? అనేది తెలియాల్సి ఉంది. ఇక ఇటీవల ముగిసిన జింబాబ్వే పర్యటనలో యువ క్రికెటర్లు రాణించారు. శ్రీలంకతో సిరీస్‌లో సైతం కుర్రాళ్లకు అవకాశం ఇస్తారా? లేదంటే సీనియర్ క్రికెటర్లను ఎంపిక చేస్తారా? అనేది ఆసక్తికరం. భారత్, శ్రీలంక తొలి టీ20 మ్యాచ్ జులై 27న ఆరంభం కానుండగా.. తొలి వన్డే ఆగస్టు 2న షురూ కానుంది. ఈ నెల మూడో వారంలో సమావేశం కానున్న సీనియర్ సెలక్షన్ కమిటీ శ్రీలంక పర్యటనకు భారత వన్డే, టీ20 జట్లను ఎంపిక చేయనుంది.

మోడీ ప్రభుత్వానికి 38 రోజులు

- తొమ్మిది ఉగ్రదాడులు
- అమరులైన 12 మంది సైనికులు

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి సోమవారంతో 38 రోజులు గడిచియోలేదా.. జమ్మూకాశ్మీర్‌లో తొమ్మిది ఉగ్రదాడులు జరిగాయి. 12 మంది సైనికులు అమరులయ్యారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్మూకాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకున్నాయని ప్రధానమంత్రి మోడీ ఎంతగా ప్రచారం చేసుకుంటున్నా.. ఈ ప్రాంతంలో ఉగ్రదాడులు గణనీయంగా పెరిగాయి. జూన్ 9న అంటే ప్రధానమంత్రిగా మోడీ మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన రోజునే జమ్మూలోని రియాసిలో జరిగిన ఉగ్రదాడిలో 10 మంది ప్రజలు మరణించగా, 33 మంది గాయపడ్డారు. ఇంకా మోడీ పాలనలో 38వ రోజున అంటే జూలై 15న జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఆర్మీ సిబ్బంది మరణించారు. దోడా జిల్లాలోని అడవుల్లోనే ఈ ఏడాదిలోనే జరిగిన అతి పెద్ద ఉగ్రదాడిగా అధికారులు పేర్కొంటున్నారు. జమ్మూకాశ్మీర్‌లో ఈ 38 రోజుల్లో తొమ్మిది ఉగ్రదాడులు జరగ్గా.. 12 మంది సైనికులు అమరులు కాగా.. మరో 13 మంది సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇక అదనంగా 10 మంది సాధారణ పౌరులు మరణించగా, 45 మంది పౌరులు గాయపడ్డారు. జమ్మూకాశ్మీర్‌లో హింసాకాండ, ఉగ్రదాడులు పెరుగుతున్నా ప్రధానమంత్రి కానీ.. హోం మంత్రి, విదేశాంగ మంత్రితో సహా ఆయన మంత్రివర్గంలో ఏ మంత్రి కూడా ఇప్పటి వరకూ స్పందించలేదు. ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ అంశంలో మోడీ ప్రభుత్వం మౌనంగా ఉండటంపై సాధరణ ప్రజలు కూడా తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తొలగించడాన్ని గొప్పగా భావించే ఇదే ప్రభుత్వం ఉగ్రవాదుల దాడులపై ఎందుకు మౌనంగా ఉందని సోషల్ మీడియాలో ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. '56 అంగుళాల ప్రభుత్వం ఎక్కడికి పోయింది?' అని ప్రశ్నిస్తున్నారు.

అలాగే, ఈ ఉగ్రదాడులకు ప్రభుత్వమే భాధ్యత వహించాలని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. ఆర్టికల్ 370 గురించి రాహుల్‌గాంధీ నేరుగా ప్రస్తావించకపోయినా.. మోడీ ప్రభుత్వ తప్పుడు విధానాలకు సైన్యం మూల్యం చెల్లింస్తుందని విమర్శించారు. 'జమ్మూకాశ్మీర్‌లో సాధరణ పరిస్థితులు ఉన్నాయనే మోడీ ప్రకటనలు ఎక్కడికి పోయాయి' అని ఖర్గే ప్రశ్నించాయి. మోడీ ప్రభుత్వ పాలన ఏమీ మారలేదని ఖర్గే విమర్శించారు.

జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రదాడులు

జూన్ 9 :
రియాసిలో బస్సుపై దాడి
10 మంది ప్రయాణీకులు మృతి
జూన్ 11
దోడాలో ఒక ఎస్‌పిఒ, ఐదుగురి సైనికులకు గాయాలు
కతువాలో 1 సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్, ఇద్దరు ఉగ్రవాదులు మృతి
జూన్ 12
దోడాలోని గండోహాలో ఒక పోలీసుకు గాయాలు
జూన్ 26
దోడాలోని గండోహాలో ముగ్గురు ఉగ్రవాదులు మృతి
జూలై 6
కుల్గాం, చినిగంల్లో జంట ఎన్‌కౌంటర్లలో ఇద్దరు సైనికులు మృతి
జూలై 8
కతువాలో ఐదుగురు సైనికులు మృతి, ఐదుగురికి గాయాలు
జూలై 9
దోడాలోని ఘడి భగ్వా వద్ద ఎన్‌కౌంటర్
జూలై 15
దోడాలోని ధరి గోటే వద్ద నలుగురు సైనికులు మృతి

ఫ్రెంచ్ ప్రభుత్వం రాజీనామా

- రేపు ప్రధాని మంత్రి ఎన్నిక?

పారిస్ : ఫ్రెంచ్ ప్రస్తుత ప్రధాన మంత్రి గాబ్రియేల్ అట్టల్, క్యాబినెట్ మంత్రులు మంగళవారం తమ పదవులకు రాజీనామా చేశారు. తమ రాజీనామాలను అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు అందచేశారు. గాబ్రియేల్ ప్రభుత్వం రాజీనామా చేసినా కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకూ కేర్‌టేకర్ ప్రభుత్వంగా కొనసాగ నుంది.

ఫ్రెంచ్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెల్లడై తొమ్మిది రోజులు గడిచినా ఇంకా కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాలేదు. ఫ్రెంచ్‌లో ఇన్ని రోజులు అస్థిరత కొనసాగడం ఇదే మొదటిసారి. తాజా ఎన్నికల్లో ఎవ్వరికీ పూర్తి మెజార్టీ రాకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటుపై సందిగ్ధత కొనసాగుతోంది. గురువారం కొత్త ప్రధానిని ఎన్నుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. పారిస్‌లో ఈ నెల 26న ఒలింపిక్స్ ప్రారంభం కానున్నాయి. ఈ ప్రారంభం సజావుగా సాగాలంటే ఆ లోగానే కొత్త ప్రభుత్వం కొలువుదీరాలని అధికారులు కోరుకుంటున్నారు.

గుజరాత్‌లో విస్తరిస్తున్న చండీపుర వైరస్

- మరో ఇద్దరి మృతి

గాంధీనగర్ : గుజరాత్‌లో చండీపుర వైరస్‌గా అనుమానిస్తున్న వైరస్ క్రమ క్రమంగా విస్తరిస్తుంది. తాజాగా ఇద్దరు చిన్నారులు మరణించడంతో ఈ వైరస్‌తో మృతి చెందిన వారి సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. ఈ వివరాలను మంగళవారం రాష్ట్ర ఆరోగ్య మంత్రి రుషికేశ్ పటేల్ గాంధీనగర్‌లో విలేకరులకు వెల్లడించారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఈ వైరస్ 15 మందికి సోకగా, వీరిలో ఎనిమిది మంది మరణించారని తెలిపారు. వ్యాధి వ్యాప్తి చెందుతున్న జిల్లాలపై నిఘా పెట్టామని మంత్రి తెలిపారు. చండీపుర వైరస్ సోకిన వారికి శరీర నొప్పులు, విరేచనాలు, వాంతులు, తీవ్రమైన మెదడువాపు వంటి లక్షణాలతో జ్వరం కలిగి ఉంటారు. ఈ వైరస్‌లో మరణాల రేటు ఎక్కువగానే ఉంటుంది, ముఖ్యంగా చికిత్స పొందడంలో జాప్యం జరిగితే రోగి జీవించడం కష్టంగా మారుతుంది.

విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం

- వర్షాలకు తొంగికోట పాఠశాల నేలమట్టం
- ఐచ్ఛిక సెలవు కావడంతో తప్పిన గండం

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా ముంచింగిపుట్టు మండలం వనమసింగి గ్రామ పంచాయతీకి చెందిన తొంగికోట గ్రామంలోని ఎంపిపి స్కూల్లో పెను ప్రమాదం తప్పింది. గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి ఈ పాఠశాల భవనం మంగళవారం కూలి నేలమట్టమైంది. పాఠశాలలకు ఐచ్ఛిక సెలవు కావడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని మండల విద్యా శాఖ అధికారి కె.కృష్ణమూర్తికి గ్రామస్తులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో పెదగూడ స్కూల్ కాంప్లెక్స్ సిఆర్‌పి అనిల్ పాఠశాలను పరిశీలించారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులుంటే పెనుముప్పు వాటిల్లి ఉండేదని తల్లిదండ్రులు తెలిపారు. ఈ పాఠశాలలో 23 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు, ఐటిడిఎ పిఒ, జిల్లా కలెక్టర్‌లు స్పందించి నూతన పాఠశాల భవనం నిర్మించాలని విద్యా కమిటీ చైర్మన్ మర్రి రాజు, గ్రామస్తులు కిముడు జయరాం, కిముడు రాంబాబు కోరారు.


కూలిన పాఠశాలను పరిశీలిస్తున్న గ్రామస్తులు

చిన్నారుల టీకాలకూ దిక్కులేదు

- లక్షలాది మందికి ఒక్క డోసూ అందలేదు
- మోడీ సర్కార్ నిర్లక్ష్యంతో గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- డబ్ల్యూహెచ్ఓ-యూనిసెఫ్ తాజా నివేదిక వెల్లడి


ఫైల్ ఫోటో

న్యూఢిల్లీ : చిన్నారుల్లో రోగనిరోధక శక్తిని మెరుగుపరచేందుకు భారత్‌లో జరుగుతున్న ప్రయత్నాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వడం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ-యూనిసెఫ్ తాజా నివేదిక తెలిపింది. బాలల్లో రోగనిరోధకత రేటును పెంచేందుకు చేసిన ప్రయత్నాలు కోవిడ్ సమయంలో...అంటే 2020లో ఫలించలేదు. 2020, 2021 సంవత్సరాల్లో ఈ రేటు తగ్గిపోయింది. అయితే 2022లో పరిస్థితి కొంత ఆశాజనకంగా కన్పించినప్పటికీ 2023లో మళ్లీ మొదటికి వచ్చింది. చిన్నారులకు ఆశించిన స్థాయిలో టీకాలు ఇవ్వకపోవడమే (వాక్సినేషన్) దీనికి కారణం. సాధారణ మెజారిటీకి దూరమైనా.. కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చామంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రతి యేటా లక్షలాది మంది చిన్నారుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. రెండు వ్యాధులకు కనీసం ఒక్క డోసు వ్యాక్సిన్ కూడా తీసుకోని చిన్నారుల సంఖ్య అధికంగా ఉన్న దేశాల్లో భారత్ కూడా ఒకటని డబ్ల్యూహెచ్ఓ-యునిసెఫ్ నివేదిక కుండబద్దలు కొట్టిందంటే బాలలకు టీకాలు వేయడంలో మోడీ సర్కార్ ఎంతటి నిర్లక్ష్యంతో ఉందో అర్థమవుతుంది. రోగనిరోధకత రేటు తగ్గడం వల్ల శిశు మరణాలు, పిల్లల్లో అనారోగ్యాలు అధికంగా ఉంటున్నాయి. 2022లో మన దేశం చిన్నారులకు అన్ని రకాల వ్యాక్సిన్లను సంతృప్తికర స్థాయిలో అందించగలిగింది. కానీ 2023లో సీను రివర్స్ అయింది. గత సంవత్సరం పిల్లలకు బిసిజి, డిటిపి (రెండు డోసులు), హెపటైటిస్, తట్టు (మొదటి డోసు), రోటా వైరస్ (డయేరియా) తదితర వ్యాక్సిన్లు తక్కువగా అందించారు. వీటిలో చాలా టీకాల వినియోగం ఇప్పటికీ కోవిడ్‌కు ముందున్న స్థాయికి చేరలేదు.

టీకాల వినియోగం తగినంతగా లేకపోవడంతో దేశంలోని చిన్నారులు పలు వ్యాధుల బారిన పడుతున్నారు. వీటిలో తట్టు ఒకటి. 2023 అక్టోబర్-2024 మార్చి మధ్యకాలంలో దేశంలో 15,590 తట్టు కేసులు నమోదయ్యాయి. ప్రపంచంలోని చిన్నారుల్లో మూడో వంతు మంది ఈ వ్యాధికి గురవుతున్నారు. వ్యాక్సినేషన్ తక్కువగా జరగడమే దీనికి కారణమని నివేదిక స్పష్టం చేసింది. రోగ నిరోధకత రేటు తగ్గడమే కాదు... ఎక్కువ మంది పిల్లలు కనీసం ఒక్క డోసు కూడా వేసుకోలేదు. గత సంవత్సరం దేశంలో 16 లక్షల మంది చిన్నారులకు ఒక్క డోసు డిటిపి వ్యాక్సిన్, తట్టు వ్యాక్సిన్ కూడా వేయలేదు.

2022లో ఈ సంఖ్య 11 లక్షలుగా ఉంది. తట్టు వ్యాధి నివారణకు ఒక్క డోసు వ్యాక్సిన్ కూడా తీసుకోని పిల్లల సంఖ్య విషయంలో నైజీరియా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో తర్వాతి స్థానం మన దేశానిదే. డిటిపి వ్యాక్సిన్ తొలి డోసు తీసుకోని చిన్నారుల సంఖ్య నైజీరియా తర్వాత భారత్‌లోనే ఎక్కువగా ఉంది.

బంగ్లాలు ఖాళీ చేయండి

- 200 మంది మాజీ ఎంపిలకు నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలోని అధికారిక నివాసాలను ఖాళీ చేయాలని 200 మందికిపైగా మాజీ లోక్‌సభ సభ్యులకు నోటీసులు జారీ అయ్యాయి. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..మాజీ ఎంపీలు తమ అధికారిక నివాసాలను త్వరగా ఖాళీ చేయకపోతే, బలవంతంగా ఖాళీ చేయించాల్సివుంటుందని నోటీసుల్లో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం.. లోక్‌సభ రద్దు అయిన నాటి నుంచి నెల లోగా తమ అధికారిక నివాసాలను మాజీ ఎంపీలు ఖాళీ చేసి ప్రభుత్వానికి అప్పగించాలి.

నీట్ యూజీ పేపర్‌లీక్ కేసులో మరో ఇద్దరి అరెస్ట్

న్యూఢిల్లీ : నీట్ -యూజీ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరిని సిబిఐ మంగళవారం అరెస్ట్ చేసింది. జార్ఖండ్ హజారీబాగ్‌లోని నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ) కార్యాలయం నుంచి ప్రశ్నాపత్రాన్ని దొంగిలించిన కీలక నిందితుడు పంకజ్ కుమార్ అలియాస్ ఆదిత్య సహా మరో నిందితుడిని సిబిఐ అదుపులోకి తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈ ఇద్దరి అరెస్ట్‌తో నీట్ పరీక్షా పేపర్ లీకేజీ, మోసం, ఇతర అవకతవకలకు సంబంధించి అరెస్టైన వారి సంఖ్య 14కి చేరిందని అన్నారు. పంకజ్ కుమార్ అలియాస్ ఆదిత్య జంషెడ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటి)లో 2017 బ్యాచ్‌కి చెందిన సివిల్ ఇంజినీర్. బొకారో నివాసి అయిన పంకజ్‌ను పాట్నాలో అరెస్ట్ చేసినట్టు సీబీఐ అధికారులు వెల్లడించారు. నీట్ పేపర్‌ను దొంగిలించడంతో పాటు ఇతర గ్యాంగ్ సభ్యులకు అందించడంలో పంకజ్‌కు సహాయం చేసిన మరో నిందితుడు రాజు సింగ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. నీట్ ప్రవేశపరీక్షలో అక్రమాలపై విచారణ జరుపుతున్న సిబిఐ ఆరు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసిన సంగతి తెలిసిందే.

అభిషేక్ బోయినపల్లి కేసు నుంచి తప్పుకున్న సుప్రీం జడ్జి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కేసులో నిందితుడు అభిషేక్ బోయినపల్లి మధ్యంతర బెయిల్‌ను సుప్రీంకోర్టు పొడిగించింది. అయితే బెయిల్ పిటిషన్‌పై విచారణ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పివి సంజీవ్ కుమార్ తప్పుకున్నారు. భార్య అనారోగ్య కారణాలపై అభిషేక్ బోయినపల్లి మధ్యంతర బెయిల్ పొందారు. తాజా పరిణామాలతో మధ్యంతర బెయిల్‌ను పొడిగించారు. మరోవైపు ఇదే కేసులో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఇడి, సిబిఐలకు సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా వేసింది.

కవితకు అస్వస్థత

- చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టయి తీహార్ జైలులో ఉన్న బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం మధ్యాహ్నం వరకూ బాగానే ఉన్న ఆమె ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. దీంతో తీహార్ జైలు సిబ్బంది.. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వెంటనే హుటాహుటిన జైలు నుంచి దీన్ దయాల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కవితకు చికిత్స అందించారు. అనంతరం కవిత అనారోగ్యంపై దీన్ దయాల్ ఆస్పత్రి వైద్యులు ప్రకటన చేశారు. సుమారు రెండు గంటలపాటు వైద్యం చేసిన అనంతరం ఆరోగ్యం నిలకడగా ఉందని ప్రకటించారు. అనంతరం ఆస్పత్రి నుంచి కవితను డిశ్చార్జి చేశారు. మళ్లీ తీహార్ జైలుకే తీసుకెళ్లారు.

గోరఖ్‌పూర్ వర్సిటీలో ఎబివిపి మూకల భీభత్సం

- విసి, రిజిస్ట్రార్‌పై దాడి

గోరఖ్‌పూర్ : ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇలాకా గోరఖ్‌పూర్‌లో బిజెపి అనుబంధ విద్యార్థి విభాగం ఎబివిపి కార్యకర్తలు శుక్రవారం రెచ్చిపోయి బీభత్సం సృష్టించారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గోరఖ్‌పూర్ యూనివర్సిటీలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌పై దాడి చేసి కొట్టారు. వారిని కిందపడేసి పిడిగుద్దులు గుద్దారు. అడ్డుకోబోయిన పోలీసులపై కూడా తిరగబడ్డారు. ఎబివిపి కార్యకర్తలు తొలుత వైస్ ఛాన్సలర్ ఛాంబర్‌పై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. వారిని నియంత్రించేందుకు ప్రయత్నించిన పోలీసులపై కూడా దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో వైస్ ఛాన్సలర్ రాజేష్ సింగ్, రిజిస్ట్రార్ అజయ్ సింగ్, కొందరు పోలీసులు గాయపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్న విద్యార్థులతో సమావేశమయ్యేందుకు వర్సిటీ అధికారులు నిరాకరించడంతో గొడవ మొదలైంది. సమస్యలు పరిష్కరిస్తామని గతంలో వైస్ ఛాన్సలర్ హామీ ఇచ్చారని, అయినా ఏమీ జరగలేదని విద్యార్థులు ఆరోపించారు. వర్సిటీలో అలజడి సృష్టిస్తున్న నలుగురు ఎబివిపి కార్యకర్తలను అంతకుముందు డీన్ సత్యపాల్ సింగ్ సస్పెండ్ చేశారు. దీంతో ఉద్రిక్తతలు పెరిగాయి. నిరసనకారులను అదుపు చేయడంలో పోలీసులు విఫలమవడంతో పరిస్థితి చేయిదాటిపోయిందని స్థానికులు తెలిపారు.

సంఘ్ పరివార్‌పై సైద్ధాంతిక ప్రచారోద్యమం

- బలమైన శక్తిగా ఇండియా బ్లాక్
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



దేశవ్యాప్తంగా ఆర్‌ఎస్‌ఎస్‌కు, సంఘ్ పరివార్ శక్తులకు వ్యతిరేకంగా సైద్ధాంతిక ప్రచారోద్యం చేపట్టాలని సిపిఐ నిర్ణయించింది. ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశం ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు బంత్ సింగ్ బ్రార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డి రాజా రాజకీయ, ఆర్థిక వ్యవహారాలు, పార్లమెంట్ ఎన్నికల సమీక్షకు సంబంధించిన నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలకు సంబంధించిన 11 తీర్మానాలను ఆమోదించారు. కౌన్సిల్ సమావేశ వివరాలను మంగళవారం నాడిక్కడ సిపిఐ ప్రధాన కార్యాలయంలో మీడియాకు డి రాజా వివరించారు. బిజెపికి పూర్తిస్థాయి మెజార్టీ రాకుండా అడ్డుకొని ప్రతిపక్ష ఇండియా ఫోరం బలమైన శక్తిగా ఆవిర్భవించిందని తెలిపారు. దీంతో రాజ్యాంగాన్ని మార్చాలనే బిజెపి కుట్రలను ప్రజానీకం ఓడించారని అభినందించారు.

ప్రతిపక్ష నాయకులను వేధించడానికి, అసమ్మతిని అణిచివేయడానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడానికే కొత్త క్రిమినల్ చట్టాలు అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో వామపక్షాలకు 9 స్థానాలే రావడం పట్ల కౌన్సిల్ సమావేశం ఆందోళన వ్యక్తం చేసిందని, రాబోయే రోజుల్లో పార్టీని, ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సివుందని నిర్ణయించినట్లు తెలిపారు. సిపిఐ ఆవిర్భవించి శత వసంతాల్లో అడుగుపెడుతున్న సందర్భంగా ఈ ఏడాది డిసెంబర్ 26 నుండి పలు కార్యక్రమాలను చేపట్టాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించినట్లు రాజా తెలిపారు.

ప్రజల జీవనోపాధి సమస్యలపై పార్టీ స్వతంత్రంగా, అలాగే ఇతర వామపక్ష పార్టీలతో కలిసి నిరంతర పోరాటం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలలో వివిధ రూపాల్లో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు వ్యతిరేకంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా, జమ్మూకాశ్మీర్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పిలుపు ఇచ్చినట్లు తెలిపారు.

తెలంగాణాలో అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద అంగన్‌వాడీ టీచర్లకు రెండు లక్షలు, సహాయకులకు లక్ష రూపాయల చొప్పున అందిస్తామని తెలంగాణ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. తమకు తీవ్ర నష్టదాయకమైన జిఒ నెం.10ని రద్దు చేయాలంటూ తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పది రోజులకుపైగా అంగన్‌వాడీలు నిరాహార దీక్షలు, కలెక్టరేట్ల ముట్టడి, పెద్దఎత్తున ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడి చేపట్టిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. రాష్ట్రంలో ఉద్యోగ విరమణ విషయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎలాంటి ఆందోళనా చెందొద్దని, త్వరలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ కొత్త జిఒ జారీ చేస్తామని మంగళవారం మంత్రి సీతక్క ప్రకటించారు. హైదరాబాద్ ఖైరతాబాద్ ప్రాజెక్టు పరిధిలోని రెహమత్‌నగర్ సెక్టర్‌లోని ఎస్ఎస్‌బి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రితో చర్చించి నాలుగైదు రోజుల్లో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌కు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచే అంశానికి సంబంధించిన కొత్త జిఒ జారీ చేసేలా చూస్తామని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బందికి కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని చెప్పారు. పిల్లలు అమ్మ ఒడిలో ఎంత సురక్షితంగా ఉంటారో.. అంగన్‌వాడిలోనూ అంతే సురక్షితంగా ఉండేలా సేవలు అందిస్తామని అన్నారు.

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి గాజాలో మరో 40 మంది చిన్నారులు బలి

గాజా : ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి మరో 40 మంది చిన్నారులు బలైపోయారు. వరుస దాడులతో శిథిలాల కుప్పగా మారినా ఖాన్‌యూనిస్ నగరంపై ఇజ్రాయిల్ సైన్యం యథేచ్ఛగా దాడులు సాగిస్తోంది. ఆపడం లేదు. నిర్వాసితులు తలదాచుకునేందుకు శిబిరాలు వేసుకున్న ప్రాంతానికి అత్యంత చేరువలో వైమానిక దాడులు జరిపింది. ఈ దాడిలో నలుగురు పిల్లలతో సహా 17 మంది మరణించగా, 26 మంది గాయపడ్డారు. సెంట్రల్ గాజాలోని నుస్రత్ శరణార్థ శిబిరంలోని స్కూలుపై జరిగిన మరో దాడిలో 23 మంది మరణించగా, 73 మంది గాయపడ్డారు. అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్న దాడుల్లో మృతి చెందినవారితో, గాయపడిన వారితో ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. డాక్టర్లు, ఇతర సిబ్బంది కూడా అలసిపోతున్నారని, అంతర్జాతీయ వైద్య బృందాలను గాజాలోకి అనుమతించాలని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ కోరింది. ఇప్పటివరకు 38,713 మంది మరణించగా, 89,166 మంది గాయపడ్డారు. దక్షిణ గాజాలోని రఫా ప్రాంతంలో తమ దాడులు కొనసాగుతునే వున్నాయని సైన్యం తెలిపింది. సాయుధ గ్రూపులకు చెందిన ఫైటర్లను పెద్ద సంఖ్యలో హతమార్చామని, వారికి చెందిన సొరంగాలు, ఇతర మౌలిక వసతులను ధ్వంసం చేశామని మిలటరీ తన నివేదికలో పేర్కొంది. మొత్తంగా 40 లక్షలపై


గుండెలవిసేలా విలపిస్తున్న చిన్నారుల బంధువులు

దాడులు జరిపామని తెలిపింది. అయితే అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించి పౌర ప్రాంతాలపై దాడులు చేసి, అమాయకులను పొట్టన బెట్టుకుంటున్నారని ఐక్యరాజ్య సమితి అధికారులు, సహాయక గ్రూపులు, ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. శనివారం తీర ప్రాంతంలోనిఅల్ మావసి శిబిరంపై జరిగిన దాడిలో 90 మంది మరణించగా, 300 మందికి పైగా గాయపడ్డారు. గత వారంలో నాలుగు పాఠశాలలపై నాలుగు రోజులు వరుసగా దాడులు జరపడంతో 50 మంది మరణించారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు.

రిపబ్లికన్ అభ్యర్థిగా మెజారిటీ దక్కించుకున్న ట్రంప్

- ఉపాధ్యక్ష అభ్యర్థిగా 'ఆంధ్రా అల్లుడు' వాన్స్



మిల్‌వాకీ (అమెరికా) : అమెరికా అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తగినన్ని ప్రతినిధుల ఓట్లను మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దక్కించుకున్నారు. విస్కాన్సిన్ రాష్ట్రంలోని మిల్‌వాకీలో సోమవారం ప్రారంభమైన రిపబ్లికన్ పార్టీ జాతీయ సదస్సులో ఆయనకు ఈ మెజారిటీ లభించింది. ఆయన కుమారుడు ఎరిక్ ట్రంప్ ఈ విషయాన్ని సదస్సులో ప్రకటించారు. దీంతో వరుసగా మూడోసారి అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ పోటీ చేయనున్నారు. 2016లో జరిగిన ఎన్నికల్లో అప్పటి ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్‌పై విజయం సాధించారు. 2020 ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ చేతిలో ఓటమి పాలయ్యారు. అంతకుముందు తన రన్నింగ్‌మేట్‌గా ఉపాధ్యక్ష పదవికి ఓహియో సెనెటర్, 'ఆంధ్రా అల్లుడు' జెడి వాన్స్‌ను ఎంపిక చేసినట్లు సోషల్ మీడియా పోస్టు ద్వారా ప్రకటించారు. దీంతో 8మాసాలుగా సాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. 2022లో అమెరికా సెనెట్‌కు ఎన్నికైన వాన్స్ 2023 జనవరిలో ప్రమణ స్వీకారం చేశారు. 2016లో ట్రంప్‌పై తీవ్రంగా విమర్శలు చేస్తూ వచ్చిన వాన్స్ తదనంతర కాలంలో ఆయనకు విధేయుడిగా మారిపోయారు. అబార్షన్‌తో సహా అనేక అంశాలపై మాజీ అధ్యక్షుడు కన్నా పచ్చి మితవాది వాన్స్. ఆంధ్రప్రదేశ్ నుండి వెళ్లి అమెరికాలో స్థిరపడిన తెలుగు కుటుంబానికి చెందిన ఉషా చిలుకూరిని వాన్స్ వివాహం చేసుకున్నారు. 'నేను ఇక్కడకు వస్తానని అనుకోలేదు, ఈసరికి చనిపోయి వుండాల్సింది.' అని ట్రంప్, సదస్సుకు బయల్దేరుతూ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. చెవికి తెల్లని బ్యాండేజీతో ఆయన సదస్సులో కనిపించారు.

కెన్యాలో నిరసనల హోరు

- అధ్యక్షుడి రాజీనామాకు పట్టు
- పోలీసుల దాడుల్లో ఒకరు మృతి



నైరోబి : కెన్యా అధ్యక్షుడు విలియం రూటో రాజీనామా చేయాల్సిందేనని పట్టుబడుతూ రాజధాని నైరోబి, ముంబాసా సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రజలు ప్లకార్డులు, పతాకాలు చేబూని శాంతియుతంగా నిరసనలు తెలియచేస్తున్నారు. రాజధానిలో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. డజన్ల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. కితెంగెలాలో ఒక ఆందోళనకారుడు మరణించినట్లు వార్తలందాయి. శాంతియుతంగా ఆందోళనలు జరుపుతున్న తమపై పోలీసులే కవ్వింపు చర్యలకు దిగుతున్నారని ఆందోళనకారులు విమర్శించారు. తమ చేతుల్లో ఆయుధాలు లేవని, కేవలం ప్లకార్డులు, పతాకాలు మాత్రమే వున్నాయని, అయినా తమపై బాష్పవాయుగోళాలను ప్రయోగిస్తున్నారని జోసెఫ్ గికారి అనే వ్యక్తి విమర్శించారు. నెల రోజుల క్రితం పన్ను పెంపు ప్రతిపాదనలను నిరసిస్తూ చేపట్టిన నిరసనల్లో ఇప్పటివరకు డజన్ల సంఖ్యలో మరణించారు. దేశమంతా తీవ్రంగా నిరసనలు వ్యక్తం కావడంతో ప్రజా ఒత్తిడికి తలొగ్గిన అధ్యక్షుడు రూటో ప్రతిపాదిత పెంపును ఉపసంహరించుకున్నారు. అయినా ప్రజలు తమ ఆందోళనలను విడనాడలేదు. ప్రభుత్వ అసమర్ధ పాలన, అవినీతి, ఆందోళనకారులను హతమార్చడం వంటి పలు అంశాలపై ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. అధ్యక్షుడు తన పదవికి రాజీనామా చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు.

ప్రతిపాదిత పన్ను పెంపు బిల్లు రద్దు చేసినా, మంత్రులను తొలగించినా పోలీసు చీఫ్‌లు రాజీనామాలు చేసినా నిరసనలు మాత్రం ఆగడం లేదు. జూన్ 26న దేశ ప్రజలనుద్దేశించి అధ్యక్షుడు ప్రసంగించారు. ఫైనాన్స్ బిల్లుపై సంతకం చేయబోనని చెప్పారు. యువతతో చర్చలు జరిపి, దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న లోటును భర్తీ చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కసరత్తు చేస్తామని హామీనిచ్చారు. అధ్యక్ష కార్యాలయం బడ్జెట్‌లో కూడా కోతలు విధిస్తామన్నారు. అయినప్పటికీ ప్రజలు శాంతించలేదు. అధ్యక్షుడు రాజీనామా చేయాల్సిందేనని కోరుతున్నారు.


సోమవారం లండన్ లో కార్బిన్ ను కలుసుకున్న ఏచూరి

కార్బిన్‌తో ఏచూరి భేటీ

లండన్: బ్రిటన్‌లో శాంతి, న్యాయం కోసం పోరాడుతున్న లేబర్ పార్టీ మాజీ నేత, సోషలిస్టు జెరిమి కార్బిన్‌తో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సోమవారం భేటీ అయ్యారు. అట్టడుగు వర్గాల ప్రజల గొంతుకగా కార్బిన్ ప్రపంచానికి తెలుసు. కీర్ స్టార్మర్ నేతృత్వంలోని ముఠా ఆయనను లేబర్ పార్టీ నుంచి గెంటివేసింది. అయినా, ఇస్లింగ్టన్ నార్త్ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి భారీ మెజార్టీతో పార్లమెంటుకు ఆయన మరోసారి ఎన్నికయ్యారు. 1983 నుండి కార్బిన్ లేబర్ అభ్యర్థిగా పార్లమెంటుకు గెలుపొందుతూ వస్తున్నారు. 2015- 2020 మధ్య లేబర్ పార్టీకి ఆయన నాయకత్వం వహించారు. పలు సంస్థల ఆహ్వానం మేరకు బ్రిటన్ వెళ్లిన ఏచూరి కార్బిన్‌తో గంటకుపైగా చర్చలు జరిపారు. బ్రిటన్, ఐర్లాండ్‌లోని ప్రవాస భారతీయ కమ్యూనిస్టుల సంఘ సమావేశంలో ఏచూరి ప్రసంగించారు. గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి రాబర్ట్ గ్రిఫిత్స్‌ను ఆయన కలుసుకున్నారు.

కార్బిన్‌తో చర్చల్లో పాలస్తీనా ప్రజల సంఘీభావ ఉద్యమం, ఉక్రెయిన్ యుద్ధం గురించి కూడా తామిరువురం చర్చించామని ఏచూరి తెలిపారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ, బ్రిటన్, భారత్ ఎన్నికల మధ్య అనేక సారూప్యతలు ఉన్నాయని చెప్పారు. బ్రిటన్‌లో ఫాసిస్టు నిగెల్ ఫరేజ్ సారథ్యంలోని యుకె రిఫార్మ్ పార్టీ 14 శాతానికిపైగా ఓట్లు సాధించడం ఆందోళనకరమైన విషయమని అన్నారు.


జస్టిస్ కోటీశ్వర్ సింగ్


జస్టిస్ ఆర్ మహదేవన్

సర్వోన్నత న్యాయపీఠంపై తొలిసారి మణిపూర్‌కు ప్రాతినిధ్యం

- సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ కోటీశ్వర్ సింగ్
- జస్టిస్ ఆర్ మహదేవన్‌కు కూడా పదోన్నతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారత సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో తొలిసారి మణిపూర్‌కు ప్రాతినిధ్యం దక్కింది. ఆ రాష్ట్రానికి చెందిన జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సర్వోన్నత న్యాయస్థానంలో మణిపూర్ వ్యక్తి న్యాయమూర్తి కావడం ఇదే తొలిసారి. జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌తో పాటు ఆర్ మహదేవన్ కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. వీరు ఇరువురికి పదోన్నతి కల్పిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవలే ప్రతిపాదనలు చేసింది. ఇద్దరు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త నియామకాలతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 34కు చేరింది.

జస్టిస్ కోటీశ్వర్ సింగ్ ప్రస్తుతం జమ్మూకాశ్మీర్, లడఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. ఆయన మణిపూర్ తొలి అడ్వకేట్ జనరల్ ఎన్ ఇబోటోంబి సింగ్ కుమారుడు. 1986లో న్యాయవాదిగా కెరీర్ ప్రారంభించిన కోటీశ్వర్ సింగ్ కూడా మణిపూర్ అడ్వకేట్ జనరల్‌గా చేశారు. గౌహతి, మణిపూర్ హైకోర్టుల్లో పని చేశారు.

జస్టిస్ మహదేవన్ ప్రస్తుతం మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. చెన్నైలో జన్మించిన మహదేవన్ మద్రాసు న్యాయ కళాశాలలోనే న్యాయ విద్య పూర్తి చేశారు. న్యాయవాదిగా దాదాపు తొమ్మిది వేల కేసులను ఆయన వాదించారు. తమిళనాడు అదనపు ప్రభుత్వ ప్లీడర్‌గా చేశారు. 2013లో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొంది సేవలందించారు. ఇప్పుడు సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు.

భూ కుంభకోణాలపై న్యాయ విచారణ

మొదటి పేజి తరువాయి

మాగాణి, ఐదు ఎకరాల మెట్ట లోబడి ఉన్న పేద రైతులను మినహాయించి ఆపైన అక్రమంగా కాజేసిన భూములను నిజమైన హక్కుదారులకు ఇచ్చేయాలని కోరారు. ఏలూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు రొయ్యల చెరువులకు వందల ఎకరాలు కొనుగోలు చేశారని, కొన్ని భూములను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని వివరించారు. వాటికోసం పేదలు పోరాడుతు న్నారని, వాటిని పేదలకు స్వాధీనం చేయాలని, అది ప్రభుత్వ బాధ్యతని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుజరాత్ తరహాలో ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు తీసుకొస్తానని చెబుతున్నారని, అక్కడ అంబానీకి ఇచ్చిన భూములపై రైతులు పోరాడి వెనక్కు తీసుకున్నారని తెలిపారు. 340 ఎకరాలు పేదల నుండి లాక్కున్న భూములను వెనక్కు ఇచ్చేయాలని సుప్రీం కోర్టు చెప్పిందని, కనుక ఆ చట్టం ఇక్కడ పనికిరాదని అన్నారు. వేల ఎకరాల భూములను పెత్తందారులకు కట్టబెడుతున్నారని, దీన్ని రాజకీయ సమస్యగా చూస్తే అసలైన దోపిడీదారులు పక్కకుపోతారని అన్నారు. వీటిపై న్యాయ విచారణ చేయాలని, అన్యాక్రాంతమైన భూములు వెనక్కు తీసుకోవాలని కోరారు.

పంటల బీమాపై ...

రైతులు ఉచిత పంటల భీమా పథకం కోరుకుంటున్నారని తెలిపారు. ఇటీవల రైతు సంఘం నాయకులు మంత్రిని కలిసిన సమయంలో 2014 తరహా పంటల బీమా పథకం ఒకటి తయారవుతుందని తెలిపారని, వాటివల్ల రైతులకు న్యాయం జరగదని పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ కట్టించుకునే వాటిలో ఎక్కువ ప్రైవేటు కంపెనీలని, రెండు మాత్రమే ప్రభుత్వ కంపెనీలని తెలిపారు. వీటిల్లో ప్రీమియం ఎక్కువశాతం ప్రైవేటు కంపెనీలకే పోతున్నాయని వివరించారు. రైతులకు ఇచ్చే క్లెయిముల్లో 80 శాతం ప్రభుత్వ రంగ కంపెనీలు, 20 శాతం ప్రైవేటు కంపెనీలు ఇస్తున్నాయని తెలిపారు. వరి, అరటి పంటలకు రెండు శాతం నుండి ఐదుశాతం వరకు రైతులు, మూడు నుండి ఎనిమిది శాతం వరకూ ప్రభుత్వాలు కడుతున్నాయని తెలిపారు. ఐదేళ్ల సగటు తీసుకుంటే రూ.1,800 కోట్లు ప్రీమియం రూపంలో రైతుల నుండి వసూలు చేశాయని తెలిపారు. రైతులకు తిరిగి ఇచ్చింది రూ.1200 కోట్లు మాత్రమేనని, రూ.600 కోట్లు రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే రైతుల వాటాను చెల్లించాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం నామినల్ పద్ధతిలో ఒక రూపాయి మాత్రమే తీసుకోవాలని సూచించారు. కేంద్రంలో చంద్రబాబునాయుడికి పలుకుబడి ఉపయోగించి ఇన్సూరెన్స్ కంపెనీని ఏర్పాటుకు అనుమతి తెచ్చి దాని ద్వారా రైతులకు క్లెయిమ్ ఇస్తే ఇంకా మిగులుతుందని అన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

స్మార్ట్ మీటర్లను పగులకొట్టాలని ప్రస్తుత మంత్రి లోకేష్ ఎన్నికల ప్రచార యాత్రలో ఊరూరా పిలుపునిచ్చారని, ఇటీవల అనకాపల్లిలో రైతులు తిరుగుబాటు చేసి మీటర్లు పగులకొట్టారని తెలిపారు. 18,75,000 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయని, వీటికి మీటరు బిగించేందుకు రూ.2,000 అవసరమైతే రూ.7,500 ప్రభుత్వం ఖర్చు చేసిందని, మెయింటినెన్స్‌కు రూ.14,000 ఇచ్చిందని తెలిపారు. . అదనపు మొత్తం షిర్డి ఎలక్ట్రికల్స్‌కు చేరిందని తెలిపారు. స్మార్ట్ మీటర్లు అప్పుడు వద్దని చెప్పిన సిఎం ఇప్పుడు కొనసాగిస్తామని చెబుతున్నారని, పైగా సోలార్ కలుపుతానంటున్నారని, ఇది సరికొత్త ఇబ్బందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉచిత విద్యుత్ గ్యారంటీకి చట్టం చేయాలని, స్మార్ట్ మీటర్లు విత్‌డ్రా చేసుకుని రికవరీ చేయాలని అన్నారు. గత ప్రభుత్వం రూ.6,500 కోట్లు స్మార్ట్ మీటర్ల కోసం ఖర్చు చేసిందని తెలిపారు. జిఓ నెంబరు 22 ప్రకారం కేంద్రమే దీన్ని రుద్దిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డబ్బులు షిర్డిసాయి, అదానీ కంపెనీలకు అప్పగించారని అన్నారు. వీటిని అంగీకరించేది లేదని తెలిపారు. డబ్బు మొత్తాన్ని రికవరీ చేయాలని డిమాండు చేశారు.





మీకోసం

రెండు చెంచాల ఏదైనా షాంపూను నీళ్లలో కలిపి స్టవ్, కిచెన్ బండను తుడిస్తే జిడ్డు వదిలి శుభ్రపడుతుంది. చీమలూ రాకుండా ఉంటాయి.

జీవన సౌరభం

ఏమీ లేనప్పుడు ఓపిక, అన్నీ ఉన్నప్పుడు ప్రవర్తన.. మనిషి వ్యక్తిత్వాన్ని పెంచుతాయి.

JEEVANA జీవన the family

చుప్పనాతి కోతిపిల్ల



చుప్పనాతి కోతిపిల్ల
చెప్పలేని అల్లరాయే
కొమ్మ పట్టి ఊగుతోంది
గూళ్ళు పట్టి లాగుతోంది.

ఓయమ్మా మీ పిల్ల చేసే
అల్లరి చూడొకసారి
చిన్నపిల్ల అని చూస్తే
చెలరేగి పోతున్నది!

ప్రతిసారీ కొమ్మనూగి
పక్షి గుడ్లు పాడు చేసి
తానేమీ ఎరగనట్లు
నీ చెంతకు చేరుతోంది

ఇలాగైతే మేమెవరూ
ఈడనుండ జాలలేము
మరోచోటు వెతుక్కుని
వలస వెళ్ళి పోతాము

బాధపడే పక్షులకు
ప్రణమిల్లె పెద్ద కోతి
ఏమిచెప్పనమ్మ దాన్కి
పిల్లచేష్ట పోలేదింకా ...

గట్టిగా కొడదామంటే
చిన్నపిల్ల అయిపోయే
ఏ చిన్నగ అన్నగాని
రాగాలు వదలదాయే!

ఆ వెంటనే కోతిపిల్ల
మరో కొమ్మ పైకిపోయే
అక్కడవున్న గూడును
పడవేయ ప్రయత్నించె!

అప్పుడే అరుదెంచెను
పెద్దముక్కు గద్ద రాజు
తనగూడు లాగుతున్న
కోతి పిల్లను చూసింది


ఒక్కసారి ముక్కుతోటి
కసితీరా పొడిచింది

పిల్లకోతి చెవిపట్టి
కిందకు విసిరేసింది!

దెబ్బతిన్న కోతిపిల్ల
వెక్కి వెక్కి ఏడిచింది
తాను చేసిన తప్పుకే
ఈ శిక్షని తలచింది.

అల్లరింక మానుకుంది
అందరితో కలిసింది
స్నేహముగా మెలిగింది
మంచిపేరు తెచ్చుకుంది!

– కూచిమంచి నాగేంద్ర,
91821 27880




సరిచేసి రాయండి

పిల్లలూ, కింద ఉన్న బొమ్మలను ఆంగ్లంలో ఏమంటారో పక్కనే ఉన్న అక్షరాలను ఉపయోగించి రాయండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



ఎస్.రామ్‌ప్రసాద్,
3వ తరగతి,
ఎస్‌టిబిఐఎం
హైస్కూలు,
విజయవాడ.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పాటలతో పాఠాలు ...

ఆటపాటలతో చిన్నారులకు చదువు పట్ల ఆసక్తి కలిగించి, వారిలో మనోవికాసానికి బాటలు వేయడానికి కషిచేస్తున్నారు ఉత్తమ ఉపాధ్యాయురాలు మురహరరావు ఉమాగాంధీ. విశాఖపట్నం శివాజీపాలెం ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి)గా ఆమె గత 13 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. తరగతి గదిలో విద్యార్థులు చక్కగా పాఠాలు వినేందుకు ఆమె వినూత్న పంథాను ఎన్నుకున్నారు. ఆటపాటలతో బోధిస్తూ, పిల్లలను అలరిస్తున్నారు.





డాక్టర్ ఉమాగాంధీ తండ్రి రామ కేశవరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేశారు. తల్లి భువనేశ్వరి గృహిణి. నలుగురు సంతానంలో ఉమాగాంధీనే పెద్ద. తమ్ముళ్లు, తన చెల్లెలు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులుగానే స్థిరపడ్డారు. తండ్రి ఉద్యోగరీత్యా గరివిడిలో పనిచేయటంతో ఆమె విద్యాభ్యాసం కూడా అక్కడే సాగింది. కోడూరు ప్రభుత్వ పాఠశాలలో తండ్రి పనిచేసే పాఠశాలలోనే ఐదో తరగతి వరకూ చదివారు. పదోతరగతి వరకూ గరివిడిలోని శ్రీరామ్ విద్యాపీఠ్, ఇంటర్, డిగ్రీ, ఎస్‌డిఎస్ కాలేజీలో పూర్తిచేశారు. ఇంటర్‌లో బైపీసీ చేశారు. డిగ్రీలో తాను చదివే కళాశాలలో జువాలజీ లేకపోవటంతో బిఎ తీసుకున్నారు.

ఉమాగాంధీ తండ్రి రామ కేశవరావు కూడా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాటలు పాడుతూ, ఆటలు ఆడిస్తూ, వారితో మమేకమవుతూ పాఠాలు చెప్పేవారు. తన తండ్రి బోధన విధానం చూసి స్ఫూర్తి పొందిన ఉమాగాంధీ తానూ ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలనుకున్నారు. భీమవరంలోని జీటీపీ కళాశాలలో బీఈడీ 1996లో పూర్తిచేశారు. 1998 డిఎస్సీలో ప్రైమరీ స్కూలు టీచర్‌గా ఎంపికై, విజయనగరంలోని మజ్జిపేట పాఠశాలలో చేరారు.

ఆ పాఠశాల అప్పుడే ప్రారంభమైంది. భవనం లేక పూరిపాకలోనే పాఠాలు చెప్పాల్సివచ్చేది. చుట్టుపక్కల పాములు, తేళ్లు వంటి విష పురుగుల సంచారం ఉండేది. అలాంటి పరిస్థితుల్లో పిల్లలను తరగతి గదిలో కూర్చోవాలని చెప్పినా పట్టించుకునే వారు కాదు. తల్లులు వచ్చి తమ బాధను మొరపెట్టుకునేవారు. ఎలాగైనా పిల్లలను తరగతి గదిలో కూర్చోబెట్టాలని నిర్ణయించుకుని తన తండ్రి అనుసరించిన విధానాన్ని ఎంచుకున్నారు ఉమాగాంధీ.

పిల్లలు ఇష్టపడేలా ఆటపాటలతో పాఠాలు చెబితే వినేందుకు ఆసక్తి చూపిస్తారు. ఆ విధానాన్ని అనుసరించి, పిల్లలను తన దారిలోకి తెచ్చుకున్నారు. అప్పటికప్పుడు పాటలను కూర్చి, పాడేవారు. అభినయం జోడించి, మనసుకు హత్తుకునేలా చెప్పేవారు. పాఠాలతో పాటుగా జాతీయ వేడుకలు, నాయకుల వర్ధంతులు, జయంతుల సందర్భాల్లో స్వాతంత్ర్య ఉద్యమంలోని కీలక ఘట్టాలను, భారత రామాయణ ఘట్టాలను చిన్నారులకు పాటలుగానే బోధిస్తున్నారు. పాటలు రూపొందించటానికి ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించరు.

నాన్నే నాకు స్ఫూర్తి

మాది భీమిలి. ఉపాధ్యాయుడిగా నాన్నకు గ్రామ ప్రజలు ఇచ్చే గౌరవం చూసి నేనూ ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లాలని చిన్నప్పుడే నిర్ణయించుకున్నా. పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ నాన్న పాఠాలు చెప్పేవారు. ఈ విధానం నన్ను బాగా ఆకర్షించింది. మంచి టీచర్‌గా పేరు తెచ్చుకోవాలంటే విద్యార్థుల మనసు గెల్చుకోవాలని అర్థమైంది. అదే స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తున్నా.

– మురహరరావు ఉమాగాంధీ

అప్పటికప్పుడు చిన్నారులు చేసే పనులను చూసి పాటలుగా మలిచి పాఠాల రూపంలో అశువుగా చెబుతారు. పిల్లలకు క్విజ్, ఆటలు, పద విన్యాసం, మ్యూజిక్, యోగా, ధ్యానం వంటివి కూడా నేర్పిస్తున్నారు. విద్యార్థులతో పలు రేడియో కార్యక్రమాలు నిర్వహించారు. ఆటలూ పాటలతో బోధించే పిల్లలు ఆమె ప్రతిభకుగానూ నాలుగేళ్ళ క్రితం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా పురస్కారం పొందారు. 2023లో కేంద్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు.

పిల్లల పాటలతో 'పాలపుంత'

పిల్లల అల్లరి, ఇతర కార్యకలాపాలను ఉమాగాంధీ గేయాలుగా మార్చి 'పాలపుంత' పేరుతో పుస్తకాన్ని వెలువరించారు. అందులో అరవైకి పైగా పాటలున్నాయి. పిల్లల ప్రతి యాక్టివిటీని పాటగా మలిచి ఇందులో నిక్షిప్తం చేశారు. పదనిసలు, రాధామాధవీయం, రాగమాల పుస్తకాలను రాశారు. వాటిలో సాహిత్యం, భాషా విన్యాసాలు, శాస్త్ర సాంకేతిక అంశాలు, యువతకు సంబంధించిన విషయాలను విశదీకరించారు. కొన్ని వందల పాటలు రాశారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు ఆమె. ఒక్కరోజు పాఠశాలకు రాకపోయినా ఎందుకు రాలేదని వాకబు చేస్తారు. ఇది తల్లిదండ్రులకు కూడా ఎంతో నచ్చుతోంది.

ఉమాగాంధీ పలు యూనివర్శిటీల నిర్వహించే సదస్సులు, వెబినార్లకు హాజరవుతున్నారు. 15 వరకూ పరిశోధనా పత్రాలను సైతం సమర్పించారు. నేషనల్ బుక్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మూడు పుస్తకాలను ఇంగ్లీష్ నుంచి తెలుగులోకి అనువాదం చేశారు. స్టేట్ రీసోర్స్ పర్సన్‌గా మూడు కీలక పోగ్రాములకు పనిచేశారు. అనేక జాతీయ, అంతర్జాతీయ వేదికలపైన తెలుగు భాష గొప్పతనాన్ని చాటుతూ పాటలు పాడారు.

– యడవల్లి శ్రీనివాసరావు

అవార్డులు... పురస్కారాలు

- 'పట్నాయకుని మోహన' కవిత్వంపై 2010లో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ద్వారా ఎంఫిల్‌లో గోల్డ్‌మెడల్
- 'శీలా సుభద్రాదేవి కవిత్వం– పరిశీలన' అంశంపై పరిశోధనకు 2016లో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుంచి డాక్టరేట్
- 2014లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- 2019లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రజల్లో చైతన్యం కల్గేలా పాడిన పాటలకు జీవీఎంసి 2022లో 'స్వచ్ఛ పురస్కార్'
- 2023లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- 2024 భారత ఎక్సెలెన్స్ అవార్డు (గోల్డ్ మెడల్)
- లీడింగ్ ఎడ్యుకేషనిస్ట్ ఆఫ్ ఇండియా అవార్డు (గోల్డ్ మెడల్)

'సైమా' రేసులో 'దసరా'



సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా) వేడుకలు ఈ ఏడాది సెప్టెంబర్ 14, 15 తేదీల్లో దుబాయ్‌లో జరగనున్నాయి. ఈ అవార్డులను దక్కించుకునేందుకు పోటీ పడుతున్న జాబితాను 'సైమా' బృందం విడుదల చేసింది. 2023లో విడుదలైన సినిమాలకు ఈ అవార్డులు దక్కనున్నాయి. టాలీవుడ్ నుంచి నాని నటించిన 'దసరా' అత్యధికంగా 11 విభాగాల్లో పోటీ పడుతోంది. తమిళ్ నుంచి 'జైలర్' 9 విభాగాల్లో బరిలో నిలిచింది. మలయాళం నుంచి టొవిలో థామస్ 2018, దర్శన్ నటించిన కాటేర (కన్నడ) 8 విభాగాల్లో రేసులో ఉన్నాయి. సైమా చైర్‌పర్సన్ బృందా ప్రసాద్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆటోమొబైల్ కంపెనీ నెక్సా స్పాన్సర్‌గా వ్యవహరించనుందని వివరించారు. ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా విజేతలను ప్రకటిస్తామని తెలిపారు. అభిమానులు తమ ఓటును సైమా ఫేస్‌బుక్ ద్వారా ఉపయోగించుకోవచ్చునని తెలిపారు.

'బలగం' నా ఫేవరేట్ మూవీ : నాని



'ఈ దశాబ్దంలోనే నాకు ఇష్టమైన సినిమా 'బలగం'. ఆ సినిమా హీరో ఫ్యాన్‌గా ఈ ఈవెంట్‌కు వచ్చాను. డార్లింగ్ సినిమా కూడా పెద్ద హిట్ అవ్వాలి. ప్రియదర్శి కెరీర్‌లో ఓ మైల్‌స్టోన్‌గా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని హీరో నాని అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన 'డార్లింగ్' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు నాని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బలగం సినిమా టాలీవుడ్‌లోనే పెద్ద సంచలనాన్ని సృష్టించిందన్నారు. అనంతరం ప్రియదర్శి మాట్లాడుతూ పరిశ్రమలో తనలాంటి వారికి హీరో నాని అన్ననే ఆదర్శమన్నారు. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా నిలబడిన వ్యక్తి ఆయన అని అభినందించారు. ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నటించిన 'డార్లింగ్' సినిమా ఈనెల 19వ విడుదల కానుంది.

మేడమ్ టుస్సాడ్స్‌లో రామ్ చరణ్



లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో రామ్ చరణ్ మైనం విగ్రహం కొలువుదీరబోతోంది. ఇప్పటి వరకు ప్రభాస్, మహేష్ బాబు, అల్లు అర్జున్ వంటి వారికి దక్కిన ఈ గౌరవం తాజాగా రామ్ చరణ్‌ని వరించింది. రామ్ చరణ్ ఎంతో ఎక్కువగా అభిమానించే తన పప్పీ రైమ్‌ని పట్టుకుని ఉన్న విగ్రహాన్నే మ్యూజియం వాళ్లు ఏర్పాటు చేయబోతున్నారు. ఫ్రెంచ్ బార్బేట్ జాతికి చెందిన రైమ్‌ని రామ్ చరణ్ ఎంతో ఇష్టపడతారు. అందుకే రైమ్‌ని పట్టుకుని ఉన్న రామ్ చరణ్ మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేసి.. రామ్ చరణ్ ఇష్టానికి కూడా గౌరవం ఇవ్వబోతున్నారని తెలుస్తోంది.



'బచ్చలమల్లి' ఫస్ట్ సింగిల్ విడుదల

అల్లరి నరేష్, అమృత అయ్యర్ జంటగా నటిస్తున్న 'బచ్చల మల్లి' చిత్రం నుంచి తాజాగా ఫస్ట్ సింగిల్ విడుదలైంది. 'సీతారామం' ఫేం విశాల్ చంద్రశేఖర్ కంపోజ్ చేసిన ఈ పాటను గౌరీ హరి, సింధు విశాల్ ఆలపించారు. శ్రీమణి లిరిక్స్ అందించారు. సామజవరగమన, ఊరు పేరు భైరవకోన వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోలో బతుకే సో బెటర్ ఫేమ్ సుబ్బు మంగాదేవి దర్శకత్వం వహిస్తున్నారు.

'పేక మేడలు' చిత్ర బృందం సందడి



వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా నటిస్తున్న సినిమా 'పేకమేడలు'. క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. శుక్రవారం నాడు ఈ సినిమా విడుదల సందర్భంగా చిత్ర యూనిట్ విజయవాడలో సందడి చేసింది. డైరెక్టర్ నీలగిరి మామిళ్ల, నిర్మాత రాకేష్ వర్రే మాట్లాడుతూ క్లాస్, మాస్ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ఈ సినిమాను తీశామన్నారు. కుటుంబం మొత్తం వెళ్లి హాయిగా సినిమా చూడొచ్చునని అన్నారు. వినోద్ కిషన్, అనూష కృష్ణ, రితిక శ్రీనివాస్, జగన్ యోగి రాజ్, అనూష నూతల, గణేష్ తిప్పరాజు, నరేన్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.

'ఎస్ఐ కోదండపాణి' సెన్సార్ పూర్తి

హీరోగా మక్కా శ్రీను, హీరోయిన్‌గా సుచిత్ర రాథోడ్ నూతన పరిచయంతో నిర్మితమైన సినిమా 'ఎస్ఐ కోదండపాణి'. శ్రీ సాయి హనుమాన్ మూవీ పతకాంపై మక్కా శ్రీదేవి నిర్మిస్తున్నారు. దిల్ రమేష్, ఏజీఎం శ్రీనివాస్, సూరినాయుడు, టిక్ టాక్ సూరిబాబు, స్వర్ణ షరీఫ్, నాగు, రమేష్, మణికంత, నందిని, దివ్య, అనూష, నాగేంద్ర రెంటాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సెన్సార్ పూర్తిచేసుకున్న ఈ సినిమా విడుదలకు సిద్ధమైంది. ఫిలిం చాంబర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రీమియర్ షోకు నటీనటులంతా హాజరయ్యారు. నూతన దర్శకుడు రెంటాల నాగేంద్ర ఈ సినిమాను తెరకెక్కించారు. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయబోతున్నామని మేకర్లు ప్రకటించారు. ముఖ్య అతిథులుగా లయన్ సాయి వెంకట్, దర్శకుడు, హీరో కళ్యాణ్ రాజ్ హాజరయ్యారు.



నగాల్ నెం.68

ఎటిపి టెన్నిస్ ర్యాంకింగ్స్



న్యూఢిల్లీ : ప్రపంచ టెన్నిస్‌లో భారత వర్ధమాన క్రీడాకారుడు సుమిత్ నగాల్.. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎదుగుతున్నాడు. తాజాగా విడుదల చేసిన ఎటిపి టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో సుమిత్ నగాల్ ఐదు స్థానాలు ఎగబాకాడు. 68వ ర్యాంకుతో కెరీర్ అత్యుత్తమ స్థానం సాధించాడు. టెన్నిస్ ఓపెన్ శకంలో ర్యాంకింగ్స్ 1973లో ఆరంభించగా.. అప్పటి నుంచి భారత్ నుంచి ఉత్తమ ర్యాంకు సాధించిన జాబితాలో శశి మీనన్ (71)ను సుమిత్ నగాల్ అధిగమించాడు. ఈ ఏడాది రెండు ప్రతిష్టాత్మక గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్లలో పోటీపడిన సుమిత్ నగాల్.. కెరీర్ భీకర ఫామ్‌లో ఉన్నాడు. ఫ్రెంచ్ ఓపెన్ సహా గత ఐదేళ్లలో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ ఈవెంట్‌లో పోటీపడిన తొలి భారత ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. విజయ్ అమృత్‌రాజ్ (18), రమేశ్ కృష్ణన్ (23), సోమ్‌దేవ్ దేవ్‌వర్మన్ (62) మాత్రమే సుమిత్ నగాల్ కంటే ముందున్నారు.

పారిస్ 2024 ఒలింపిక్స్‌కు ఎంపికైన సుమిత్ నగాల్.. విశ్వక్రీడల్లో మరోసారి టైటిల్ వేట సాగించనున్నాడు. లియాండర్ పేస్ తర్వాత వరుసగా రెండు సార్లు ఒలింపిక్స్ టెన్నిస్ సింగిల్స్ ఈవెంట్‌లో పోటీపడుతున్న తొలి ఆటగాడిగా సుమిత్ నగాల్ నిలిచాడు. ఈ ఏడాది హీల్‌బ్రాన్ చాలెంజర్, చెన్నై ఓపెన్ ఎటిపి చాలెంజర్ ట్రోఫీలను సుమిత్ నగాల్ గెల్చుకున్న సంగతి తెలిసిందే.



సిడ్నీలో సూపర్ కింగ్స్ అకాడమీ

- సెప్టెంబరు నుంచి కోచింగ్

చెన్నై : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో అత్యంత విజయవంతమైన ప్రాంఛైజీ చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్‌కె) ఈ ఏడాది ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో క్రికెట్ అకాడమీ ప్రారంభించనుంది. ఇప్పటికే రెండు అంతర్జాతీయ సూపర్ కింగ్స్ అకాడమీలు నడిపిస్తున్న సూపర్‌కింగ్స్ యాజమాన్యం కంగారూల దేశంలో మూడోది మొదలుపెట్టనున్నారు. డల్లాస్ (యుఎస్ఎ), రీడింగ్ (బ్రిటన్)లో ఇప్పటికే సూపర్‌కింగ్స్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీలు విజయవంతంగా నడుస్తున్నాయి. సిడ్నీ ఒలింపిక్ పార్కు సమీపంలోని క్రికెట్ సెంట్రల్‌లో సూపర్ కింగ్స్ అకాడమీ ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలతో ఏర్పాటు కానున్న క్రికెట్ అకాడమీలో ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణ ఏడాది పొడవునా కొనసాగనున్నాయి. బాలురు, బాలికలకు ఈ ఏడాది సెప్టెంబరు నుంచి క్రికెట్ కోచింగ్ ఇవ్వనున్నారు. ఈ మేరకు చెన్నై సూపర్‌కింగ్స్ ప్రాంఛైజీ సిఇఒ కాశీ విశ్వనాథన్ ఓ ప్రకటనలో తెలిపారు.

అండర్-19 జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

- ఆరు వికెట్ల తేడాతో కడప జట్టు విజయం



ప్రజాశక్తి - కడప

వైఎస్ఆర్ జిల్లా కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ క్రికెట్ స్టేడియం, కెఒఆర్ఎం, కెఎస్ఆర్ క్రికెట్ మైదానాలలో ఎసిఎ అండర్–19 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లు మంగళవారం ప్రారంభమయ్యాయి. వైఎస్ఆర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. ఎసిఎ స్టేడియంలో జరిగిన ఆరంభ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్, కడప జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 37.1 ఓవర్లను ఎదుర్కొని 103 పరుగులకు ఆల్ అవుట్ అయింది.

ఆ జట్టులోని జి.మన్విత్ రెడ్డి 36 పరుగులు చేశారు. కడప జట్టులోని బి.ప్రణవ్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ వేసి 4 వికెట్లు తీసుకున్నారు. ధీరజ్ కుమార్‌రెడ్డి 3, ధర్మ సేనా రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 134 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 23.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని గురు విగ్నేష్ 43 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని వెంకట్ లోకేష్ రెండు వికెట్లు పడగొట్టారు.

రాణించిన విశాఖ జట్టు

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో 71 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టుపై 71 పరుగుల తేడాతో విశాఖపట్నం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన నార్త్ జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన విశాఖపట్నం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 273 పరుగులు చేసింది. ఆ జట్టులోని జి.ఈశ్వర్ రిత్విక్ 94 పరుగులు, కాస్ ప్రసాద్ 54 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని జున్నారావు 2, సాయి సుజన్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం 274 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నార్త్ జోన్ జట్టు 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 202 పరుగులు మాత్రమే చేసి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని ఎన్.సుశాంత్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించారు. 166 బంతులను ఎదుర్కొని 16 బౌండరీలు, ఒక సిక్సర్ సహాయంతో 121 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. విశాఖపట్నం జట్టులోని పి.డి.రచిత్ 2, యువన్ 2 వికెట్లు తీసుకున్నారు.

73 పరుగుల తేడాతో సెంట్రల్ జోన్ జట్టు విజయం

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై 73 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ జట్టు 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. ఆ జట్టులోని కెఎల్ శ్రీనివాస్ 75, రేవంత్ నాగకుమార్ 63 పరుగులు చేశారు. కృష్ణా జట్టులోని యశ్వంత్ 3, సాయి ప్రకాష్ 2, రాజేష్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 311 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసి ఓటమి చెందింది. ఆ జట్టులోని కాజా మొహిద్దీన్ 121 పరుగులు (సెంచరీ) చేశాడు. సెంట్రల్ జట్టులోని ఆదిత్య 2, షేర్ షా 2 వికెట్లు తీసుకున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68